ISSN 2583-9020

An Electronic Veda Journal

# वेद वाणी

(vEda vaaNee)

Volume 1, Issue 4, January 2024



Printed and Published by

**Veda Samskruti Samiti**

Malkajgiri

Hyderabad TS

# సర్వం ఖల్విదం బ్రహ్మ

**సోమంచి (తంగిరాల) విశాలాక్షి**

వైస్ ప్రెసిడెంట్, వేద సంస్కృతి సమితి, హైదరాబాద్

నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞాన మూర్తిమ్
విశ్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్!
ఏకం సత్యం విమలమచలం సర్వ ధీ సాక్షి భూతమ్
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి!!
శ్రుతి స్మృతి పురాణానా మాలయం కరుణాలయమ్!
నమామి భగవత్పాద శంకరం లోక శం కరమ్!!
సదాశివ సమారంభాం వ్యాస శంకర మధ్యమాం!
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్!!

ఏ అంశమునైనను తార్కికముగా నిరూపించినచో, శాస్త్రీయపరముగా చెప్పినచో నది వైజ్ఞానిక పరముగా చేసిన సమర్పణమే అవుతుంది.

మన ప్రస్తుత అంతర్జాతీయ చర్చాసభ (seminar) యొక్క ముఖ్య ఆంశము లేక ప్రయోజనము ఏమిటంటే, సర్వ శాస్త్రములకు, అన్ని విద్యా విభాగములకు మూలము వేదములు అనీ, సంస్కృత వాఙ్మయము అని నిరూపించటము, మన సమస్త వైదిక వాఙ్మయమునకు వైజ్ఞానిక పరమైన వివరణను ఇవ్వగలము అని వివరించటము.

విజ్ఞాన శాస్త్రము భౌతిక విషయములను, విజ్ఞాన శాస్త్ర అంశములనే చెప్తుంది. తత్త్వ శాస్త్రము - ఆధ్యాత్మిక విద్య మటుకు భౌతికమైన, వైజ్ఞానిక శాస్త్రపరమైన అంశములను చెప్పటముతో పాటు విజ్ఞానశాస్త్రము ఆగిపోయిన చోటి నుంచి కూడా ప్రారంభించి ముందుకు సాగి, మూలములోకి, లోతుల్లోకి వెళ్ళి 'నేను' ను గురించి, మనను గురించి మనకు చెప్తుంది. ప్రపంచంలోని ఎవరైనా 'నేను' అంటారు. ఏదైనా 'నేను' అనే అంటుంది. ఆ 'నేను' ను గురించి తెలుసుకుంటే, సర్వము తెలిసినట్టే!

'*కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి*' (ముండకోపనిషత్తు - 1.1.3) దేనిని తెలుసుకుంటే అన్నింటిని తెలుసుకున్నట్లవుతుంది? అని ప్రశ్నించగా '*యద్ విజ్ఞానేన సర్వమిదం విజ్ఞాతం స్యాత్, తద్ బ్రహ్మ*' ఏది తెలిస్తే సర్వము తెలుస్తుందో అదియే బ్రహ్మము.

'*యేనాశ్రుతం శ్రుతం భవత్యమతం మతమవిజ్ఞాతం విజ్ఞాతమితి*' (ఛాందోగ్యోపనిషత్ - 6.1.3) అని గురువు గారు సమాధానం చెప్పారు. మహావాక్యములు 'నేను' ను గురించి చెప్తున్నాయి.

'సర్వజ్ఞుడు' అంటే సర్వము పరమాత్మే అని తెలిసినవాడు. అంతేకానీ సర్వజ్ఞుడు' అంటున్న వారికి

కుమ్మరి పని వచ్చునా! కమ్మరి పని వచ్చునా! అని అడగటం ఉచితము కాదు.

పరమాత్మ చేత విశ్వ కల్యాణము కొరకు అనుగ్రహింప బడిన అపౌరుషేయ వేద విజ్ఞానమంతయు వైజ్ఞానిక పరమైనదే! దేవభాషయగు సంస్కృత భాషయందు ఆవిష్కృతమైన ఈ విజ్ఞానమంతయు విశ్వ విజ్ఞానమునకు మూలము.

పరమాత్మ చేత అనుగ్రహింపబడి, మహర్షులతో బోధింప బడిన వేదముల సారము ఉపనిషత్తులు. ఉపనిషత్సారము మహావాక్యములు. మహావాక్యముల సారమును ఛాందోగ్యోపనిషత్తులో చెప్పబడిన 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే మహావాక్యముగా గ్రహించవచ్చును. సర్వ వేదోపనిషత్తులు ఈ మహాద్భుత వాక్యార్థమును బోధించుట కొరకే సమకట్టినందున ఈ వాక్యమునకు మూలాధార మహావాక్యము, (Fundamental Mahavakya) అని పేరు పెట్టాను. మూలాధార మహావాక్యమగు 'సర్వం ఖల్విదం బ్రహ్మ' మును గురించిన అవగాహనను. ఈ వ్యాసము ద్వారా కలిగించాలనుకుంటున్నాను.

ఈ వ్యాసములో మహావాక్యముల వివరణను, మూలాధార మహావాక్య వివరణను ఆధ్యాత్మిక పరముగా, తాత్త్విక పరముగా, వైజ్ఞానిక పరముగా, సాంఖ్య, యోగ సిద్ధాంతముల పరముగా, వేదాంత పరముగా వివరించటానికి ప్రయత్నిస్తున్నాను.

మూలాధార మహావాక్యమైన 'సర్వం ఖల్విదం బ్రహ్మ' వాక్యార్థ వివరణను, ఈ మహావాక్యము బోధిస్తున్న సత్యాన్ని స్వచ్ఛమైన మనస్సుతో మానవులందరూ సంపూర్ణంగా అర్థం చేసుకుని, ఆకళించుకోగలిగితే, మానవులందరూ సత్వగుణ భరితులై, జిజ్ఞాసువు (బ్రహ్మ జిజ్ఞాసువు) లవగలుగుతారు, యథార్థ జ్ఞానాన్ని పొంద గలుగుతారు. కుటుంబములో, సమాజములో, దేశములో, ప్రపంచములో నైతిక విలువలు వర్ధిల్లుతాయి, అసమానతా భావనలు తొలగి పోతాయి, శాంతి సౌఖ్యములు, సౌమనస్యము వర్ధిల్లుతాయి, ఆత్మానందము లభిస్తుంది.

'*సర్వం ఖల్విదం బ్రహ్మ*' - అను వాక్యము ఏ అర్థమును బోధించుచున్నదో, ఆ అర్థమునే బోధించునటువంటి '*ఇదం సర్వం యదయమాత్మా*', '*సర్వం హ్యేతద్ బ్రహ్మ*' వంటి అనేక వాక్యములు వేదములలో, ఉపనిషత్తులలో చెప్పబడినా, సర్వ వైదిక వాఙ్మయమునకు మూలము, ఆధారము అయిన వాక్యముగా, ఉపనిషద్బోధ సారముగా 'సర్వం ఖల్విదం బ్రహ్మ', అను వాక్యమునే మూలాధార మహావాక్యముగా భావిస్తున్నాను. ఎందుకనగా ఇంతకంటే ఉత్కృష్టముగా సర్వ వేదోపనిషత్సారమును, పరబ్రహ్మమును చెప్పగలమా!!

'*సర్వం ఖల్విదం బ్రహ్మ, తజ్జలానీతి శాంత ఉపాశీత*, అని ఛాందోగ్యోపనిషత్తు (3.14.1) బోధించుచున్నది. '*ఇదం సర్వం బ్రహ్మ ఖలు*' '*ఖలు ఇదం సర్వం బ్రహ్మ*' ఈ కనిపిస్తున్న విశ్వమంతా పరబ్రహ్మమే! 'ఇదం సర్వం బ్రహ్మ' -

అను వాక్యమునకు ఖలు అను అవ్యయమును చేర్చటము వలన ఈ మహావాక్యము అంతటి విశిష్టతను సంతరించుకున్నది. 'ఖలు' అను పదమునకు అర్థము 'తప్పనిసరిగా' అని. ఆంగ్ల భాషలో surely, indeed అంటాము. తప్పనిసరిగా ఈ సృష్టి అంతా పరబ్రహ్మమే! అని ఈ మహా వాక్యము బోధిస్తున్నది. 'ఖలు' అను పదముతో నిర్ధారించటము వల్లనే ఈ వాక్యమునకు ఇంతటి విశిష్టత కలిగినది.

సర్వము బ్రహ్మము లోనుంచే వస్తున్నాయి, బ్రహ్మము వలననే వర్ధిల్లుతున్నాయి, బ్రహ్మములోనే లీనమవుతున్నాయి. 'తస్మాత్' జాయతే, 'తస్మిన్' లీయతే, 'తేన' అస్తి ఇతి తజ్జలాని, తత్ జలాని. తజ్జలాని అని తెలుసుకుని శాంతముగా ఉపాసించవలెను. 'తజ్జలాని' అంటే, 'తజ్జత్వాత్, తన్నిష్ఠత్వాత్, తల్లత్వాత్' - అని తెలుసుకోవాలి. 'తత్' అంటే ఆ పరబ్రహ్మము. 'జన్ - జా' అను ధాతువునకు అర్థము పుట్టుట, అనగా సృష్టి, 'తజ్జత్వము'. 'ల, లీ- లయ్' అను ధాతువునకు కలిసిపోవుట, కరిగిపోవటము అని అర్థము. అనగా లయము, 'తల్లత్వము'. 'అన్' అనగా ఉండటము, సృష్టి కొనసాగటము. స్థితి అని అర్థము. అందుకే 'ప్ర' అనే ఉపసర్గతో కూడిన 'అన్' అను ధాతువును ప్రాణము అంటున్నాము. విశ్వమంతటా ఉండి, మనలో ఉన్న చిచ్ఛక్తే 'ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు' అని పిలవబడే ప్రాణము. నేటి విజ్ఞాన శాస్త్రము చెప్పలేని ప్రాణము గురించి, ప్రాణోపాసనను గురించి ఉపనిషత్తులు చెప్పాయి, ప్రశ్నోపనిషత్తు వివరించింది. 'తన్నిష్ఠత్వము'. నిష్ఠ అనగా అందులోనే ఉండటము, పోషింపబడటము అని అర్థము. కనుక ఈ దృశ్య జగత్తంతా 'తజ్జలాని'.

నీరు అధిష్ఠానముగా కలిగిన అలలు, బుడగలు, సుడిగుండాలు మొదలైనవన్నీ సముద్రంలో నీటిలో పుట్టి, నిలిచి, లయించిపోయినట్లుగానే, ఈ దృశ్య జగత్తంతా తనకు అధిష్ఠానమైన బ్రహ్మము నుంచి ఉద్భవించి, వర్ధిల్లి, బ్రహ్మములో లయించి పోతున్నది. ఇలా చెప్పటము కూడా మన వ్యవహారానికి మాత్రమే! ఉన్నది కేవలము బ్రహ్మమే! ఈ జ్ఞానము కలగటమే 'సర్వం ఖల్విదం బ్రహ్మ' మును అనుభవించటము, అర్థం చేసుకోవటము.

ఈ 'తజ్జలాని' అన్న ఉపనిషత్ బోధనే సహజకవి శ్రీ బమ్మెర పోతనామాత్యులవారు శ్రీమదాంధ్ర మహా భాగవతములోని, అష్టమ స్కంధము, గజేంద్ర మోక్షణములో, ఈ క్రింది పద్యములో వివరించారు —

*'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై*
*యెవ్వనియందు డిందు పరమేశ్వరు డెవ్వడు మూలకారణం*
*బెవ్వడనాదిమధ్యలయు డెవ్వడు సర్వము తానేయైన వా*
*డెవ్వడు వాని నాత్మభవునీశ్వరు నే శరణంబు వేడెదన్*

భగవంతుని - పరమాత్మ గురించిన నిర్వచనమును ఇంతకంటే గొప్పగా ఇంకెవ్వరూ చెప్పలేరన్నది సత్యము.

'*ఇదం సర్వం యదయమాత్మా*'. (బృహదారణ్యకోపనిషత్తు - 2.4.6) ఇదం సర్వం యత్ అయమ్ ఆత్మా. ఇదం సర్వం యత్, తత్, అయమ్ ఆత్మా.

ఈ కనిపించే సర్వము ఆ ఆత్మయే! ఏదైతే ఈ సర్వముగా గోచరిస్తున్నదో, అది ఈ ఆత్మ. మన అంతరాత్మ. అనగా పరమాత్మయే! పరబ్రహ్మమే!

మహా మహిమాన్వితమైన '*సర్వం ఖల్విదం బ్రహ్మ*' అన్న ఒక్క సత్యాన్ని, నిత్య సత్యాన్ని చెప్పటానికే నాలుగు మహావాక్యములు వచ్చాయి. ఈ నాలుగు మహావాక్యములను వివరించటానికి అనేకమైన మహావాక్య సదృశ వాక్యములు వివరింపబడినాయి. ఈ ఉపనిషత్సార వాక్యార్ధ బోధ కొరకే ఇంతటి వేదరాశి, ఇతిహాస పురాణములు, శాస్త్రములు అన్నీ ఏర్పడినాయి. అనంతమైన స్తోత్రాలు గద్యపద్య రచనలు అన్నీ అనుగ్రహించబడినాయి. అనగా సర్వ శాస్త్ర సారము ఉపనిషత్తులలో జ్ఞాన బోధక వాక్యములుగా బోధింపబడుతున్నది. అనంతమైన ఆ వాక్యముల సారము సూత్ర సదృశమైన, బీజ భూతములైన నాలుగు మహావాక్యములుగా చెప్పబడినది. నాలుగు మహావాక్యముల సారమే మూలాధార మహావాక్యముగా చెప్పదగిన '*సర్వం ఖల్విదం బ్రహ్మ*'. గణిత శాస్త్రములో, విజ్ఞాన శాస్త్రములో సూత్రములను ఇస్తారు. తరువాత వాటిని వివరిస్తారు. శ్రీ శ్రీనివాస రామానుజం గారు ఇచ్చిన ఫార్ములాలకు కొన్నింటికి ఇంకా ఇప్పటికీ పరిష్కారం కనుక్కోలేదు. అలాగే వేదములలోని, ఉపనిషత్తులలోని మహావాక్యములు, మహావాక్య సదృశ వాక్యములు అటువంటివే!

శ్రీ శుక రహస్యోపనిషత్తులో ఈ నాలుగు మహావాక్యములు ప్రస్తావించ బడినాయి. వేదవ్యాస మహర్షి తన కుమారుడైన శ్రీ శుకునకు బ్రహ్మోపదేశం చెయ్యమని పరమేశ్వరుని ప్రార్థించారు. సాంబసదాశివుడు శ్రీ శుక మహర్షికి శాశ్వతము, కైవల్య ప్రదమగు బ్రహ్మోపదేశమును, ప్రణవ సహితముగా నాలుగు మహావాక్యముల రూపమున ఉపదేశించారు. '*అథ మహావాక్యాని చత్వారి. యథా, ఓం ప్రజ్ఞానం బ్రహ్మ, ఓం అహం బ్రహ్మాస్మి, ఓం తత్త్వమసి, ఓం అయమాత్మా బ్రహ్మ*'. (శుక రహస్యోపనిషత్తు - 19)

మహావాక్యములను షడంగములతో వివరించారు. పరమేశ్వరుని చేత రహస్యోపనిషదుపదేశమును పొందిన శ్రీ శుకమహర్షి జగత్తు పరబ్రహ్మములో లీనమగుటను అనుభవించి, తానే జగత్స్వరూపులుగ, బ్రహ్మ స్వరూపులుగ పరిణమించి, పరమ వైరాగ్య భావమును పొంది బ్రహ్మానంద మగ్నుడై అడవిలో వెళ్ళిపోతుంటే, బ్రహ్మ సూత్రములను, అష్టాదశ మహా పురాణములను, శ్రీ మహాభారతాది గ్రంథరాజములను రచించిన, సాక్షాత్తుగా శ్రీ మహావిష్ణు స్వరూపులైన వేదవ్యాస భగవానులు పుత్ర మోహంతో 'హా కుమారా! నన్నొదిలి వెళ్ళకు నాయనా!' అంటూ ఎలుగెత్తి అరుస్తూ కొడుకు వెంట పరుగెత్తారట. శ్రీ శుక బ్రహ్మము సకల జగత్స్వరూపమును పొందుట వలన, అప్పుడు సర్వ భూతములు ఆయన పలుకులకు ప్రతిధ్వనించాయి. తన పుత్రుడు సర్వమయుడని గ్రహించి వ్యాసమహర్షి పరమానందం పొందారు, శ్రీమద్భాగవతము రచించి పరమ శాంతిని పొందారు.

అసలు మహావాక్యము అంటే ఏమిటి? గొప్ప వాక్యము. '*మహత్ చ ఇదం వాక్యం మహావాక్యమ్*. పరమోత్కృష్టమైన వాక్యము. మహత్తును - పరబ్రహ్మమును గురించి చెప్పే వాక్యం మహావాక్యము.

జ్ఞాన కాండ అయిన ఉపనిషత్తులు పరబ్రహ్మమును '*అణోరణీయాన్మహతో మహీయాన్* (కఠోపనిషత్తు - 1.2.20) అన్నాయి. ఆత్మ తత్త్వము అణువు కంటే అణువు, మహత్తు కంటే మహత్తు. అణువులోను, మహత్తులోను ఉన్న శక్తి అఖండమైనది, అనంతమైనది, నాశన రహితమైనది.

దీనినే ఆధునిక విజ్ఞాన శాస్త్ర వేత్తలు తమ 'అణు సిద్ధాంతము (Atomic theory) లో 'అణువులో ఎంత శక్తి ఉన్నదో, విశ్వములో అంత శక్తి ఉన్నదని' చెప్తారు. ఎందుకంటే విశ్వమంతా అణుసముదాయమే కనుక.

కణాద మహర్షి రచించిన, షడ్దర్శనములలో ఒకటైన వైశేషిక దర్శనము ఈ సృష్టి అంతా అణువులతో నిర్మించబడినదని చెప్తోంది. మన ఆధునిక అణుసిద్ధాంతమునకు మూలము కణాదుని వైశేషిక సిద్ధాంతమే !

విజ్ఞానశాస్త్రంలో 'Matter can neither be created, nor destroyed' అని చెప్పారు. అలాగే 'Energy can neither be created, nor destroyed' అంటారు. 1905వ సంవత్సరంలో ఆల్బర్ట్ ఐన్స్టైన్ అనే విజ్ఞాన శాస్త్రవేత్త 'ఘనపదార్థంగా కనిపించే ద్రవ్యమంతా నిజానికి ఏదో ఒక శక్తి స్వరూపమేననీ, పదార్థాన్ని శక్తి రూపంలోకి పరివర్తనం చెందించటం సాధ్యమే'నని నిరూపిస్తూ వ్యాసం వ్రాసి ప్రకటించాడు. అందులో $E=mc^2$ అనే సూత్రాన్ని ప్రకటించాడు. ఈ పదార్థము, శక్తి గురించి, ప్రాణోపాసన గురించి ప్రశ్నోపనిషత్తులో వివరంగా బోధింపబడినది. సృష్టిలో రయి అనగా పదార్థము (Matter), ప్రాణము అనగా శక్తి (Energy) కలిసి ఉంటాయని చెప్పారు. ప్రతి పదార్థములోను ద్రవ్యము, శక్తి అనగా సంకల్పము, చిచ్ఛక్తి కలిసి ఉంటాయని బోధించారు. ఎన్నో లక్షల సంవత్సరాల క్రితం మన మహర్షులు చెప్పిన సత్యాలను ఆధునిక యుగంలో విజ్ఞాన శాస్త్రవేత్తలు పరిశోధించి నిరూపిస్తున్నారు.

మన ఉపనిషత్తులలో, హైందవ దర్శనములలో విశ్వము పరమాత్మ సంకల్పంతో సృష్టింప బడింది. పదార్థము (Matter) పరమాత్మలో - శక్తిలో ఉన్నది. శక్తి నుంచి బహిర్గత మవుతుంది. పరమాత్మే విశ్వంలా కనిపిస్తున్నాడు. '*విశ్వం విష్ణుః వషట్కారో*...' ఆ శక్తినే ఆధునిక వైజ్ఞానికులు Energy అంటారు. మన వేదాంతులు 'పరబ్రహ్మము' అంటారు. మహావాక్యములు ఈ శక్తిని గురించి, పరమాత్మను - పరబ్రహ్మమును గురించి, ప్రకృతి గురించి, జీవుని గురించి, జీవబ్రహ్మైక్యమును గురించి చెప్తున్నాయి.

వాక్యము అనగా చెప్పబడినది. వచ్ - చెప్పుట, వాచ్యము - చెప్పదగినది, చెప్పబడినది. 'మహత్' అయిన పరతత్త్వమును గురించి చెప్పబడిన వాక్యము

మహావాక్యము. పరబ్రహ్మమును గురించి చెప్పునవి కనుక మహావాక్యములు అత్యంత రహస్యములు. ఇంద్రియాతీత జ్ఞానము కనుక అది రహస్యమైనది.

అపౌరుషేయ వేదముల యొక్క గూఢ భావము మహావాక్యములలో చెప్పబడినది. అవాఙ్మానస గోచరమైన, అనుభవైక వేద్యమైన పరబ్రహ్మమును గ్రహించుటకు ఉపకరించు బోధలు మహావాక్యములు. మహర్షులకు, యోగులకు తపస్సమాధి స్థితిలో సాక్షాత్కరించిన, స్ఫురించిన నిత్య సత్యముల సారము మహావాక్యములు. మహర్షులు తపస్సమాధి స్థితిలో ఉన్నప్పుడు వారికి వినిపించిన, స్ఫురించిన, వారు అనుభవించిన అలౌకికమైన జ్ఞాన వాక్కులు మహావాక్యములు.

నాలుగు వేదములకు సంబంధించిన నాలుగు ఉపనిషత్తుల నుండి ఒక్కొక్క వేదము యొక్క సారముగా ఆ వేదమునకు సంబంధించిన ఒక్కొక్క ఉపనిషత్తు నుండి ఒక్కొక్క మహావాక్యము స్వీకరింపబడినది. ఋగ్వేదమునకు సంబంధించిన ఐతరేయోపనిషత్తులోని '*ప్రజ్ఞానం బ్రహ్మ*', (3.1.3) యజుర్వేదమునకు చెందిన బృహదారణ్యకోపనిషత్తులోని '*అహం బ్రహ్మాఽస్మి*', (1.4.10) సామవేదాంతర్గతమగు ఛాందోగ్యోపనిషత్తులోని '*తత్త్వమసి*', (6.8.7) మరియు అథర్వణ వేదాంతర్గతమగు మాండూక్యోపనిషత్తులోని '*అయమాత్మా బ్రహ్మ*' (మాం. ఉ. 2) అనునవి నాలుగు మహావాక్యములు. జగద్గురువులు శ్రీ ఆదిశంకర భగవత్పాదులు తమ నలుగురు ముఖ్య శిష్యులకు ఈ నాలుగు మహావాక్యములను ఉపదేశించారు. బ్రహ్మ జిజ్ఞాసువులగు శిష్యులకు గురువులు మహావాక్యములను ఉపదేశిస్తారు. మహావాక్యోపదేశమును పొందటానికి అర్హత - శిష్యులు సాధన చతుష్టయ సంపన్నులై ఉండటము. ఉపనిషత్తులలో అనేకములైన గొప్ప వాక్యములున్నను, ఈ నాలుగే మహావాక్యములు అని మనకు శుకరహస్యోపనిషత్తు వలన తెలియుచున్నది. మరి ఈ నాలుగు మహావాక్యములకు, ఇతర ఉపనిషద్వాక్యములకు గల తేడా ఏమిటి? అని పరిశీలిద్దాము. ఉన్న ఒకే ఒక్క పరబ్రహ్మమును, పరతత్త్వమును మనము అనేక నామరూపాలతో కొలుస్తున్నాము. అలాగే ఉపనిషత్తులలోని గొప్ప గొప్ప వాక్యములన్నీ ఆ ఒకే ఒక్క పరబ్రహ్మమును గురించే చర్చిస్తున్నాయి. అన్ని వాక్యములు పరబ్రహ్మమును గురించే వివరిస్తున్నాయి. కానీ ఈ నాలుగు మహావాక్యములు కలిసి సంపూర్ణముగా, సమగ్రముగా పరబ్రహ్మమును బోధపరుస్తున్నాయి. ఈ మహావాక్యములు అరణి సదృశములై, సూత్రప్రాయములై, బీజ రూపములై సర్వ వేదోపనిషత్సారమైన మూలాధార మహావాక్యమును 'సర్వం ఖల్విదం బ్రహ్మ' ను బోధిస్తున్నాయి. 'సా కాష్ఠా సా పరా గతిః' (కఠోపనిషత్తు - 1.3.11) అన్నట్లుగా అదే పరమమైనది, పరమావధి. దీనికి మించి మరొకటి లేదు. ఇక్కడ 'సా' అంటే అది. అది అనగా అనిర్వాచ్యమైన పరబ్రహ్మము. నిర్గుణము, నిరంజనము, త్రిగుణాతీతము, త్రిలింగాతీతము, త్రికాలాతీతము కనుకనే పరబ్రహ్మమును 'తత్' శబ్దంతో

చెప్తాము. తత్ శబ్ద రూపములగు 'సః', 'సా', 'తత్' లతో చెప్తాము. మొదటి మహావాక్యము 'ప్రజ్ఞానం బ్రహ్మ'. ప్రకృష్టమైన జ్ఞానము ప్రజ్ఞానము. దీనిని 'వివరణ వాక్యము' అంటారు. జ్ఞానము అనేదే బ్రహ్మము. జ్ఞానము అంటే తెలివి, తెలుసుకొనుట. జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను త్రిపుటి జ్ఞానమే ప్రజ్ఞానము. త్రిపుటి ఏకమవటమే ప్రజ్ఞానము. జ్ఞానము అంటే ఎరుక. జ్ఞానము అనేది లౌకిక జ్ఞానము, పారలౌకిక జ్ఞానము, ఆత్మ జ్ఞానము కూడా. జ్ఞానము, విజ్ఞానము, ప్రజ్ఞానములు మన అనుభవములోనివే. పంచ జ్ఞానేంద్రియముల ద్వారా, పంచ కర్మేంద్రియముల ద్వారా, మనస్సు ద్వారా, పఠన, శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా జ్ఞానము కలుగుతున్నది. వాక్కు ద్వారా జ్ఞానము కలుగుతుంది. వాక్కు చేత, బుద్ధి చేత చతుర్వేదాలు, వేదాంగాలు, పురాణేతిహాసాలు, యజ్ఞ యాగాలు, సర్వ జ్ఞానము తెలియుచున్నది. విశ్వము గ్రహించబడుచున్నది. సర్వ జీవరాశి గురించి, స్థావర జంగమాత్మక ప్రకృతి గురించి తెలియుచున్నది. భూతభవిష్యద్వర్తమానములను తెలుసుకుంటున్నాము. అటువంటి వాక్కు వల్ల, బుద్ధి వల్ల తెలియబడు జ్ఞానము ప్రజ్ఞానము. సృష్టిలో వేటివేటి నుంచి జ్ఞానము పొందుతున్నామో అవన్నీ బ్రహ్మము యొక్క అంశములే. సృష్టి రూపములో ప్రకటితమవుతూ, యావద్విశ్వానికీ ఆధారమయిన, విశ్వ స్వరూపమయిన, విశ్వాతీతమైన చిచ్ఛక్తే పరబ్రహ్మము అని అనుభవముతో తెలుసుకోవటమే ప్రజ్ఞానము. ప్రజ్ఞానమే బ్రహ్మ. భౌతిక స్థితిలో తెలిసే జ్ఞానము ప్రత్యక్ష జ్ఞానము, పరోక్ష జ్ఞానము. అది అపరోక్షమవాలి. ఆ అపరోక్ష జ్ఞానమును అనుభూతి చెందాలి. శ్రీ ఆదిశంకర భగవత్పాదులు 'అపరోక్షానుభూతి' అను ప్రకరణ గ్రంథమును రచించారు. తైత్తిరీయోపనిషత్తులోని భృగువల్లిలో అపరోక్ష జ్ఞానము తపస్సు ద్వారా సిద్ధిస్తుందనీ, అంతర్ముఖ స్థితిలో విజ్ఞానము గోచరిస్తుంది కనుక విజ్ఞానమే బ్రహ్మమని చెప్పబడింది. '*విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్* (తైత్తిరీయోపనిషత్తు - 3.5.1).

'*యేనేక్షతే శృణోతీదం జిఘ్రతి వ్యాకరోతి చ।*

*స్వాద్వస్వాదూ విజానాతి తత్ప్రజ్ఞానముదీరితమ్*' ॥

(ఉపనిషత్కల్పతరువు - 1 - పేజీ 7)

దేని వలన రూపమును చూచుచున్నామో, దేని వలన శబ్దమును వినుచున్నామో, దేని వలన వాసన గ్రహించుచున్నామో, దేని వలన నోటితో మాట్లాడ గలుగుతున్నామో, రుచి అరుచి అని తెలుసుకుంటున్నామో, మధుర మధురేతర వస్తువులను గుర్తిస్తున్నామో దానినే 'ప్రజ్ఞానము' అన్నారు.

'*యదేతద్ధృదయం మనశ్చైతత్. సంజ్ఞాన, మాజ్ఞానం, విజ్ఞానం, మేధా, దృష్టిర్ధృతిర్మతిర్మనీషా, జూతిః, స్మృతిః, సంకల్పః, క్రతురసుః, కామో, వశ ఇతి సర్వాణ్యేవైతాని ప్రజ్ఞానస్య నామధేయాని భవన్తి* (ఐతరేయోపనిషత్తు - 3.2). ఈ హృదయము, మనస్సు, చేతనత్వము, ఈశ్వరత్వము, సమస్త వివేకము, సద్ జ్ఞానము, శాస్త్ర జ్ఞానము, సకలము నెరిగెడి జ్ఞానము,

ధైర్యము, మననము, మనోదార్ఢ్యము, మనో వేదన జ్ఞానము, స్మరణము, రూపాదులను గ్రహించు జ్ఞానము, నిశ్చయము, ప్రాణ వృత్తి, ఆశ, స్వాధీనత అనునవన్నియు ప్రజ్ఞానము యొక్క నామధేయములే అగుచున్నవి. అనుభవ జన్య జ్ఞానము విజ్ఞానము. జ్ఞానమును ఆచరణలో చూపించినప్పుడు అది విశేషమైన జ్ఞానము - విజ్ఞానమవుతుంది. 'ఏష బ్రహ్మ, ఏష ఇంద్రః, ఏతే ప్రజాపతిరేతే సర్వే దేవాః, ఇమాని చ పంచభూతాని పృథివీ వాయురాకాశ ఆపో జ్యోతీగ్ంష్యేతానీమాని చ క్షుద్రమిశ్రాణీవ । బీజానీతరాణి చేతరాణి చాండజాని చ జారుజాని చ స్వేదజాని చ ఉద్భిజ్జాని చ అశ్వాగావః పురుషా హస్తినో యత్కించేదం ప్రాణి జంగమం చ పతత్రి చ యచ్చ స్థావరమ్! సర్వం తద్ప్రజ్ఞా నేత్రం. ప్రజ్ఞానే ప్రతిష్ఠితం । ప్రజ్ఞా నేత్రో లోకః, ప్రజ్ఞా ప్రతిష్ఠా, ప్రజ్ఞానం బ్రహ్మ' (ఐతరేయోపనిషత్తు - 3.3). ఇతడే బ్రహ్మ, ఇతడే ఇంద్రుడు, ఇతడే ప్రజాపతి. ఈ దేవతలందరూ అతడే! భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశమనెడు పంచ మహా భూతములు, అల్పమగు జంతువులు, విత్తనములు, స్థావర జంగమములు, అండజములు, జరాయుజములు, స్వేదజములు, ఉద్భిజ్జములు, గుఱ్ఱము, ఆవు, ఏనుగు, మనుష్యులు, ఇంకా జంగమములైన అన్ని రకముల ప్రాణులు, ఎగిరే పక్షులు అన్నియు ఆ ప్రజ్ఞా నేత్రములే. ప్రజ్ఞానమునందే నిలకడ కలిగి ఉన్నవి. లోకమంతా ప్రజ్ఞానమునే నేత్రముగా కలిగి ఉన్నది. ప్రజ్ఞానమునందే ప్రతిష్ఠింపబడి, ప్రజ్ఞానము ఆధారముగా ఉన్నది. '*ప్రజ్ఞానమే బ్రహ్మ*'. ప్రకృతి, జీవాత్మ, పరమాత్మల జ్ఞానము ప్రజ్ఞానమే! జ్ఞానమును విద్య అనవచ్చును. ముండకోపనిషత్తులో ఇలా ఉన్నది - శౌనక మహర్షి అంగిరస మహర్షిని ఇలా ప్రశ్నించారు - '*కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి*' (ముండకోపనిషత్తు - 1.1.3). హే భగవన్! దేనిని తెలుసుకున్నట్లైతే, అన్నింటినీ తెలుసుకున్నట్లు అవుతుంది'? దానికి గురువుగారు 'ఆత్మను తెలుసుకుంటే సర్వము తెలుస్తుందని' చెప్పారు. ముండకోపనిషత్తులో అంగిరస మహర్షి ఇలా చెప్పారు - '*ద్వే విద్యే వేదితవ్యే ఇతి హ స్మ యద్ బ్రహ్మవిదో వదన్తి పరాచైవాపరా చ*'. '*తత్రాఽపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వ వేదః శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం ఛందో జ్యోతిషమితి, అథ పరా యయా తదక్షరమధిగమ్యతే*!! (ముండకోపనిషత్తు - 1.1.4&5).

పరావిద్య, అపర విద్య అని విద్య రెండు రకాలుగా ఉంటుందని బ్రహ్మవిదులు చెప్తున్నారు. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వ వేదము, శిక్ష, కల్పము, వ్యాకరణం, నిరుక్తం, ఛందశ్శాస్త్రం, జ్యోతిషం వంటివన్నీ అపర విద్యలే! ఏ విద్య చేత అక్షరుడగు పరమాత్మ యొక్క స్వరూపము ప్రాప్తిస్తుందో అది పరా విద్య, బ్రహ్మ విద్య. ఈ పరా అపరా విద్యల జ్ఞానము ప్రజ్ఞానము.

రెండవ మహావాక్యము '*అహం బ్రహ్మాస్మి*'. నేనే ఆ పరబ్రహ్మమును అయి ఉన్నాను. దీనిని 'అనుభవ వాక్యము' అంటారు. ఏ విశ్వ చైతన్యము అఖండము, అనంతము,

నిర్గుణము, నిరవద్యము, నిరంజనమో, ఆ విశ్వ చైతన్యమే యావద్విశ్వానికీ అతీతము, విశ్వాధారము, విశ్వాంతర్గతము. అదే సర్వ జీవులందు, సర్వ ప్రాణులందు, సమస్త వస్తు సంజాతమందు ప్రకాశిస్తున్నది. అదే మన దేహేంద్రియాదులకు, మనో బుద్ధులకు, సర్వమునకు ఆధారము. అదే పరబ్రహ్మము. మన దేహేంద్రియములను ప్రకాశింపజేస్తూ ఆ పరంజ్యోతే మనలో 'నేను' అనే స్ఫురణతో ఉన్నది. అవిద్యలో ప్రతిఫలించిన ఆ చైతన్యమునే 'నేను' అని వ్యవహరిస్తున్నాము. ఈ 'నేను' యే బ్రహ్మమని గుర్తించటమే, అనుభవించటమే '*అహం బ్రహ్మాఽస్మి*'. ఏ ఆశ్రమంలో ఉన్నవారు ఆ ఆశ్రమ ధర్మాలను పాటిస్తూ, ఎవరి కర్తవ్యాలను వారు ధర్మబుద్ధితో, చిత్తశుద్ధితో, సృష్టిలోని ఏదీ నాది కాదు, సర్వము పరమాత్మదే, సర్వము పరమాత్మే - '*ఈశావాస్యమిదం సర్వం*' అనే భావముతో, ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తూ, శాస్త్ర పఠనము ద్వారా జ్ఞానము సంపాదించుకుని, మననము చేస్తూ, ఆలోచించి, తపించి, అప్పుడు ముక్తులవాలి, మోక్షం పోందాలి. ఆ జ్ఞానమే '*అహం బ్రహ్మాఽస్మి*' జ్ఞానము.

'*బ్రహ్మవిదాప్నోతి పరమ్*' (తైత్తిరీయోపనిషత్తు - 2.1.1) - అన్న ఈ వాక్యాన్ని వివరించటానికి '*దశమస్త్వమసి*' ని చెప్తారు. అజ్ఞానము వల్ల యదార్థజ్ఞానం లోపిస్తుంది, దానివల్ల దుఃఖం కలుగుతుంది. పదిమంది శిష్యులు ఏరుదాటి వచ్చారు. వారిలో ఒకతను తనను వదిలేసి మిగతా తొమ్మిది మందిని మాత్రమే లెక్కించి, తమ పదిమందిలోనుంచి ఒకరిని ఏరు మింగేసిందని భోరుమంటుంటే గురువుగారు వచ్చి, పదిమందిని నిలబెట్టి లెక్కించి మీరు పదిమంది క్షేమంగా ఉన్నారు, ఆ పదవ వాడివి నువ్వే అని చెప్పగానే, అజ్ఞానము నశించగానే సరైన జ్ఞానం కలిగిన అతను 'నేనే పదవ వాడను' అని గ్రహించగానే పదవవాడయ్యాడు. అలాగే ఎవరు బ్రహ్మ జ్ఞానమును గ్రహించినా వారు బ్రహ్మమే అవుతారు. బ్రహ్మజ్ఞాని నిత్య ముక్తుడే. భేద దృష్టి నుంచి అభేద దృష్టికి వెళ్ళగలిగినప్పుడు '*అహం బ్రహ్మాఽస్మి*' అనే అనుభవ జ్ఞానం వస్తుంది. 'అహమస్మి' అనే స్పృహ బ్రహ్మమునకున్నది. దేహానికి లేదు. 'నేను ఉన్నాను' అని మనలోని బ్రహ్మము వల్లనే అంటున్నాము. మనము మనస్సుతో 'నేను' అని భావిస్తున్నాము. ఇంద్రియాలతో విషయాలను అనుభవిస్తున్నాము. కనుక ఇంద్రియాలతో కూడిన ఈ దేహమే నేను అనుకుంటున్నాము. 'అహం బ్రహ్మాఽస్మి' అనుభవంలోకి రావటానికి అంతర్ముఖులమవాలి. మన ఈ దేహము చైతన్యము వల్ల పని చేస్తున్నది. పరబ్రహ్మమును ఆధారం చేసుకుని ప్రవర్తిస్తున్నది. బ్రహ్మము అనే చైతన్యము జీవుని ద్వారా ప్రసరిస్తూ, దేహం ద్వారా బైటకు వస్తున్నది. 'నేను' అనే చైతన్యము 'పరబ్రహ్మమ' ని గ్రహిస్తే 'నేను' అనేది అనుభవంలోకి వస్తుంది. విద్యుచ్ఛక్తి కంటికి కనపడదు. కానీ లైట్లు, మైకులు, మిక్సీలు, ఫాన్లు మొదలైన పరికరముల ద్వారా ప్రకటిత మవుతుంది.

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ తనకంటే శ్రేష్ఠమైనదేదీ లేదనీ, దారముతో గుచ్చబడిన పూసలలాగా సమస్త జగత్తు తనయందే కూర్చబడినదనీ చెప్పారు.

'*మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ।*

*మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ* ॥

(భగవద్గీత - 7.7)

చక్కెర కలిపిన నీటిని చూపించి 'ఇదేమిటీ?' అని అడిగితే, చూడగానే మంచినీరని చెప్తాము. కాస్త రుచి చూపిస్తే, త్రాగి, పంచదార కలిపిన నీరని చెప్తాము. అనుభవ జ్ఞానమే అసలైన జ్ఞానము. మంచినీరని చెప్పేవి భౌతిక విద్యలు. చక్కెర నీరని గ్రహించేలా చేసేది ఆత్మ విద్య.

'*బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్. తదాత్మానమేవావైత్. అహం బ్రహ్మాఽస్మీతి. తస్మాత్ తత్ సర్వమభవత్* (బృహదారణ్యకోపనిషత్తు - 1.4.10). '*అతః బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి*'. ఈ సమస్త ప్రపంచము సృష్టికి పూర్వము పరబ్రహ్మముగానే ఉన్నది. ఆ పరబ్రహ్మము 'నేను పరబ్రహ్మమునయి ఉన్నాను' అని తనను తాను తెలుసుకున్నది. ఈ విధముగా తెలుసుకొనుట వలన పరబ్రహ్మము తానే సర్వ స్వరూపముగా అయినది. ఎవరు తమను పరబ్రహ్మముగా తెలుసుకుంటారో, వారు బ్రహ్మమే అగుచున్నారు. వారే ఆ పరబ్రహ్మముగా భాసిస్తారు. ఈవిధంగా జీవాత్మ స్థాయి నుంచి విశ్వాత్మ స్థాయికి ఎదిగి అనుభవంతో ఆత్మను పొందాలని ఉపనిషత్తులు చెప్తున్నాయి.

ఈ విధంగా మహావాక్యములను ఆధ్యాత్మిక పరంగా తెలుసుకోవాలి.

'*పరిపూర్ణః పరాత్మాఽస్మిన్ దేహే విద్యాధికారిణి।*

*బుద్ధేః సాక్షితయా స్థిత్వా స్ఫురన్నహమితీర్యతే* ॥

(ఉపనిషత్కల్పతరువు - 1 - పేజీ 7)

ఈ శరీరమందు పరిపూర్ణుడైన పరమాత్మ బుద్ధికి సాక్షిభూతుడై యుండి ప్రకాశించువాడై 'నేను' 'అహం' అని చెప్పబడుచున్నాడు.

'*స్వతః పూర్ణః పరాత్మాఽత్ర బ్రహ్మ శబ్దేన వర్ణితః।*

*అస్మీత్యైక్య పరామర్శః తేన బ్రహ్మ భవామ్యహమ్*' ॥

(ఉపనిషత్కల్పతరువు - 1 - పేజీ 7)

స్వతః సిద్ధముగా పరిపూర్ణుడై ఆ పరమాత్మయే బ్రహ్మ శబ్ద వాచ్యుడౌతున్నాడు. జీవ బ్రహ్మముల యొక్క ఐక్యతను 'అస్మి' అను అనుసంధాన క్రియా పదము తెలియజేయుచున్నది. కనుక నేను ఆ పరబ్రహ్మమును, పరమాత్మను అగుచున్నాను.

జగద్గురువులు శ్రీ ఆది శంకర భగవత్పాదులు తమ మహావాక్య దర్పణంలో ఇలా చెప్పారు...

'*బ్రహ్మైవాహమిదం విశ్వం ఇతి విశ్వస్యచాత్మనః।*

*బ్రహ్మ మాత్రత్వ విజ్ఞానం నిర్గళమనారతమ్*' ॥

నేను బ్రహ్మమును. ఈ విశ్వమంతా బ్రహ్మము చేత నిండి ఉండి, బ్రహ్మము తప్ప ఇతరము లేనిది. కనుక ఈ జ్ఞానముతో ప్రపంచమును దర్శించు వారు, ప్రవర్తించు వారు భవ బంధముల నుంచి ముక్తులవుతారు.

*'బ్రహ్మైవాస్మీ ऽతి బోధేన దేహోऽహమితి ధీ పశుమ్।*

*కృత్వా పూర్ణాహుతిం బ్రహ్మణ్యశరీరో భవేన్మునిః* ॥

'నేను బ్రహ్మమును' అనే జ్ఞానముతో, శరీరముతో సంబంధము ఉన్నదనే జ్ఞానమును కలిగించే మనస్సు అనే జంతువును పరబ్రహ్మమనే హోమాగ్నిలో ఆహుతిగా సమర్పించిన బ్రహ్మజ్ఞాని తానే నిరాకార బ్రహ్మమగుచున్నాడు.

మూడవ మహావాక్యము '*తత్త్వమసి*'. దీనిని 'ఉపదేశ వాక్యము' అంటారు. 'తత్' అనగా అది, ఆ పరమాత్మ. 'త్వం' అనగా నీవు, జీవుడు. 'అసి' అనగా అయి ఉన్నావు. ఇది అనుసంధాన క్రియాపదము. '*తత్త్వమసి*' అనగా అది నీవే అయి ఉన్నావు. పరబ్రహ్మము నీ సహజ స్వభావము. అది నీవే అయి ఉన్నావు. ఈ మహావాక్యమును 'జీవ బ్రహ్మైక్య బోధక వాక్యము' అని కూడా అంటారు. 'అసి' అన్న పదము ఐక్యతను తెలియజేస్తున్నది. 'తత్' కి 'త్వం' కి ఐక్యత చెప్పబడింది.

గురువు గారు, తండ్రి అయిన ఉద్దాలక మహర్షి, తన కుమారుడు, శిష్యుడు అయిన శ్వేతకేతువునకు '*యద్విజ్ఞానేన సర్వమిదం విజ్ఞాతం స్యాత్, తద్ బ్రహ్మ*' (ఛాందోగ్యోపనిషత్తు) అని చెప్పి, ఏది తెలిస్తే సర్వము తెలుస్తున్నదో ఆ విజ్ఞానమును, బ్రహ్మమును గురించి అనేక ఉపనిషత్తులతో వివరిస్తూ '*తత్త్వమసి శ్వేతకేతో*' అంటూ తొమ్మిది సార్లు బోధించారు.

'*యథా సౌమ్యైకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాద్వాచారంభణం వికారో నామధేయమ్, మృత్తికేత్యేవ సత్యమ్*' । (ఛాందోగ్యోపనిషత్తు - 6.1.4). ఓ సౌమ్యా ! మట్టి ముద్దను తెలుసుకుంటే, మట్టితో తయారైన కుండలు, మూకుళ్ళు, ముంతలు, కుండీలు మొదలైనవన్నీ తెలుస్తున్నాయి. ఉన్నది ఒక్క మట్టే. అదే సత్యం. దాని నుండి తయారైనవన్నీ అసత్యములు. మూల సత్యము యొక్క వికారములు, మార్పు కలిగినవి, నశించిపోయేవి. ఏ మార్పు లేని అవికారము మట్టి. నామరూపములు వికారములు. నామరూపములకు ఆధారమైన పరబ్రహ్మము సత్యము, అవినాశి, మార్పు లేనిది. అదే విధంగా బంగారము మూల పదార్థము. ఆభరణములు దాని వికారము. అలాగే ఇనుము మూల పదార్థము. దానితో చేయబడిన వస్తువులు వికారములు.

'*స య ఏషోऽణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యం స ఆత్మా, తత్త్వమసి శ్వేతకేతో*' । (ఛాందోగ్యోపనిషత్తు - 6.8.7) అని వివరిస్తూ, సత్తును అసత్తును వివరిస్తూ, పరబ్రహ్మ లక్షణములను గురించి తెలియపరచి, 'నీవు ఆ పరబ్రహ్మమువే అయి ఉన్నావు' అని బోధించారు. జహదజహల్లక్షణా వృత్తితో 'ఆ దేవదత్తుడే ఈ దేవదత్తుడు' అనీ, 'సోऽయం ద్విజ' ఉదాహరణతో, బాల్యములో తప్పిపోయిన రాజకుమారుడు, మేకల గుంపులో పెరిగిన సింహ కిశోరము వంటి

ఉదాహరణలతోను, అనేక ఉపపత్తులతో 'తత్త్వమసి' మహావాక్యమును వివరించ వచ్చును.

*'ఏకమేవాద్వితీయం సన్ నామరూప వివర్జితమ్ ।*

*సృష్టేః పురాఽధునాఽప్యస్య తాదృక్త్వం తదితీర్యతే ॥*

(ఉపనిషత్కల్పతరువు - 1 - పేజీ 8)

సృష్టికి పూర్వము ఏకము, అద్వితీయము, నామరూప రహితము, స్వజాతీయ, విజాతీయ, స్వగత భేదములు లేని ఏ చిద్రూప పరబ్రహ్మమున్నదో, అదియే తత్పదార్థము. అదియే లక్షణా వృత్తితో సృష్టి తరువాత కూడా అదే లక్షణములు కలదిగా చెప్పబడుచున్నది.

*'శ్రోతుర్దేహేంద్రియాతీతం వస్త్వత్ర త్వం పదేరితమ్ ।*

*ఏకతా గ్రాహ్యతేఽసీతి తదైక్యమనుభూయతామ్ ॥*

(ఉపనిషత్కల్పతరువు - 1 - పేజీ 8)

నిరంతరముగా గురూపదేశమును వినుట వలన, అనవరతము మహావాక్యములను మననము చేయుట వలన ముక్తి పొందగోరిన వ్యక్తికి - జీవునికి, 'నీవు స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు భిన్నమైన వాడివి' అని బోధింపబడుచున్నది. ముముక్షువు 'తత్' పద అర్థమును 'త్వం' పద అర్థమును బాగుగా మననము చేసి, 'తత్' 'త్వం' ల ఐక్యతను అనుభవించ వలెను. నాల్గవ మహావాక్యము 'అయమాత్మా బ్రహ్మ'. ఈ వాక్యము కూడా 'వివరణ వాక్యమే'. ఈ మహావాక్యమును 'సాక్షాత్కార వాక్యము'గా కూడా పండితులు పరిగణిస్తారు.

'*మాండూక్యమేకమేవాలం ముముక్షూణాం విముక్తయే*' అన్నారు. 12 మంత్రములతోనే పరిపూర్ణ బ్రహ్మ జ్ఞానమును బోధిస్తున్న మాండూక్యోపనిషత్తుకు శ్రీ గౌడపాదాచార్యులవారు కారికలను (సూత్రాది వివరణ శ్లోకములు) వ్రాశారు. జగద్గురువులు శ్రీ ఆదిశంకర భగవత్పాదాచార్యులు దశోపనిషత్తులకు భాష్యము వ్రాశారు. వాటి సహాయముతో మనము ఉపనిషత్తులను అధ్యయనం చేసి, అర్థం చేసుకోవాలి. ఈ మాండూక్యోపనిషత్తు ఓంకారమును వివరిస్తూ, 'అయమాత్మా బ్రహ్మ'ను బోధిస్తున్నది. 'నామము' 'నామీ' అవిభక్తములు. నామము ఓంకారము, పరబ్రహ్మ వాచకము. నామీ ఈ విశ్వము.

'*సర్వం హ్యేతద్ బ్రహ్మ. అయమాత్మా బ్రహ్మ*'. (మాండూక్యోపనిషత్తు - 2). ఈ సర్వము బ్రహ్మమే. ఈ ఆత్మయే బ్రహ్మ. మన కంటికి కనుపించేది, కనుపించనిది అంతా బ్రహ్మమే. మనలో ఉన్న జీవాత్మ కూడా బ్రహ్మమే ! ఈ జీవాత్మ జాగ్రదవస్థలో విశ్వుడుగా, స్వప్నావస్థలో తైజసుడుగా, సుషుప్త్యవస్థలో ప్రాజ్ఞుడుగా వ్యవహరిస్తూ తురీయావస్థలో సమాధి స్థితిలో తనను తానే ఆత్మనని గుర్తిస్తాడు. అది గుర్తింపు కూడా కాదు. కేవల ఆత్మగా, పరమాత్మగా, సచ్చిదానందముగా, శుద్ధ చైతన్య రూపంగా భాసిస్తాడు. అన్ని పాదములలోను, అన్ని అవస్థలలోను ఉన్నది ఆత్మ అనీ, జీవాత్మకు, పరమాత్మకు చైతన్య రూపములో భేదము లేదనీ ఈ ఉపనిషత్తులోని మహావాక్యము 'అయమాత్మా బ్రహ్మ' బోధిస్తున్నది. 'అయమ్'

- 'ఇది' లేక 'ఇతడు' అనే సర్వనామమునకు అనంతమైన అర్థ వివరణ చెయ్యవచ్చును. 'అయమ్' 'ఇది' అని దగ్గరగా ఉన్న దాన్ని అంటాము. 'అది' అని దూరంగా ఉన్న దానిని అంటాము. అనిర్వచనీయమైన దానిని 'అది' అంటాము. ప్రపంచంలోని ప్రతి వస్తువు దేనికదే, ప్రతి ప్రాణి ఎవరికి వారే తమను 'అయమ్' శబ్దముతో 'ఈ ఆత్మ' అనీ 'ఈ నేను' అనీ చెప్పవచ్చును. కనుక 'అయమ్' అనేది విశ్వములోని సర్వ వస్తు జాతానికి, సర్వ ప్రాణికోటికీ వర్తిస్తుంది. 'అయమాత్మా', 'ఈ ఆత్మ' అన్నది అందరికీ, అన్నింటికీ కేంద్రమే ! ఈ ఆత్మే బ్రహ్మము అన్నప్పుడు ప్రతి మనిషి, ప్రతి ప్రాణి, ప్రతి వస్తువు పరబ్రహ్మమేనని సులభంగా గ్రహించవచ్చును. మనకు అన్నింటి కంటే అత్యంత సమీపంలో ఉన్నది మనలోని 'నేను'యే. ఆ నేను అనేదే 'అయమ్'. అదియే 'ఆత్మ'. 'అయమాత్మా బ్రహ్మ'.

'*నాంతః ప్రజ్ఞం, న బహిః ప్రజ్ఞం, నోభయతః ప్రజ్ఞం, న ప్రజ్ఞాన ఘనం, న ప్రజ్ఞం, నాఽప్రజ్ఞం, అదృశ్యమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్య మేకాత్మ ప్రత్యయ సారం ప్రపంచోపశమం, శాంతం, శివమద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మా స విజ్ఞేయః* । (మాండూక్యోపనిషత్తు - 7). తురీయుడు అంతః ప్రజ్ఞుడు కాడు, బహిః ప్రజ్ఞుడు కాడు, ఉభయ ప్రజ్ఞుడు కాడు, ప్రజ్ఞాన ఘనుడు కాడు, ప్రజ్ఞుడు కాడు, అప్రజ్ఞుడు కాడు. ఆయన అదృశ్యుడు, వ్యవహారానికి అందని వాడు, లక్షణ రహితుడు, చింతింపబడనివాడు, శబ్దముతో నిర్దేశింప వీలు కాని వాడు, ఏకాత్మ ప్రత్యయ కారుడు, ప్రపంచోపశముడు, శాంతుడు, శివుడు, అద్వైతుడు. అతడే ఆత్మ. అతనినే తెలుసుకోవాలి.

'*స్వప్రకాశాఽపరోక్షత్వమ్ అయమిత్యుక్తితో మతమ్* ।
*అహంకారాది దేహాన్తాత్ ప్రత్యగాత్మేఽతి గీయతే* ॥

(ఉపనిషత్కల్పతరువు - 1 - పేజీ 8)

స్వయం ప్రకాశమై, అపరోక్షమై, 'అయం' శబ్ద వాచ్యమై, అహంకారాదులును, దేహమును కానిదైన ఆ పరబ్రహ్మము 'ప్రత్యగాత్మ' అని చెప్పబడుచున్నది.

'*దృశ్యమానస్య సర్వస్య జగతస్తత్త్వమీర్యతే*।
*బ్రహ్మ శబ్దేన తద్ బ్రహ్మ స్వప్రకాశాత్మ రూపకమ్*' ॥

(ఉపనిషత్కల్పతరువు - 1 - పేజీ 8)

కంటికి కనుపడు సమస్త జగమునకు తత్త్వము చెప్పబడుచున్నది. స్వయం ప్రకాశాత్మకమైన ఆ బ్రహ్మ రూపమే పరబ్రహ్మముగా చెప్పబడుచున్నది.

నాలుగు మహావాక్యముల గురించిన ఈ ఎనిమిది శ్లోకములు శ్రీ శుకరహస్యోపనిషత్తులో (21, 22 మరియు 23 మంత్రములు) వివరించబడినాయి. నాలుగు మహావాక్యములు అనబడే నాలుగు స్థంభముల మీద, అనేక ఇతర మహావాక్య సదృశ వాక్య రూపమైన గోడలు, కిటికీలు, తలుపులు, కప్పులాంటి వాటితో నిర్మింపబడిన భవ్య, దివ్య, రమ్య హర్మ్యమే 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనబడే మూలాధార మహావాక్యము. ఈ భవంతికి పునాది వేదములే! ఉపనిషత్తులే! మూలాధార మహావాక్యమే! మూలాధార మహావాక్యమనబడే గొప్ప పునాది పైన, నాలుగు

మహావాక్యములనబడే స్థంభముల ఆధారంగా నిర్మింపబడిన దివ్య భవన సదృశమే అద్వైతము, వేద సారము. ఈ కనిపించే సర్వము బ్రహ్మమే! 'అయమాత్మా బ్రహ్మ' అయినప్పుడు, ఈ జ్ఞానము కలగటమే బ్రహ్మము 'ప్రజ్ఞానం బ్రహ్మ' అయినప్పుడు, ఆ బ్రహ్మము నీవే అయి ఉన్నావు, 'తత్త్వమసి' అని గురువు శిష్యునికి బోధించగా, జీవాత్మే పరమాత్మ అనీ, నేనే పరబ్రహ్మమును, 'అహం బ్రహ్మాస్మి' అని సాధకుడు గుర్తించినప్పుడు, అది, ఇది, నువ్వు, నేను, సర్వము, జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము, జిజ్ఞాసువు, కర్త, కర్మ, క్రియ, కరణము బ్రహ్మమే అయినప్పుడు జీవాత్మ, పరమాత్మలు బ్రహ్మమే అయినప్పుడు, బోధకుడు, బోధ అందరూ, అన్నీ బ్రహ్మమే అయినప్పుడు బ్రహ్మాండము, పిండాండము బ్రహ్మమే అని నిరూపించ బడినప్పుడు 'అది తప్ప వేరొకటి లేదు' '*ఏకమేవాద్వితీయం*' (ఛాందోగ్యోపనిషత్తు - 6.2.1) అని శ్రుతి చెప్తున్నప్పుడు ఇవన్నీ కలిసి బోధిస్తున్నది '*సర్వం ఖల్విదం బ్రహ్మ*' అనే కదా ! దీనికి 'మూలాధార మహావాక్యము' అని పేరు పెట్టవచ్చును కదా ! నాలుగు మహావాక్యముల సారము - 'సర్వం ఖల్విదం బ్రహ్మ'. 'ఇదం సర్వం బ్రహ్మ ఖలు'. 'ఖలు ఇదం సర్వం బ్రహ్మ'. ఈ కనుపించే సర్వము - ప్రపంచమంతా - విశ్వమంతా, సృష్టి అంతా పరబ్రహ్మమే ! ఈ మూలాధార మహావాక్యమును 'విధి వాక్యము' అంటారు. అనగా ఎదురు ప్రశ్నించకుండా వేద ప్రమాణము వలన తప్పనిసరిగా అందరూ పాటించవలసిన వాక్యము, దైవ శాసనము. ఈ విధి వాక్య సారమే సర్వోపనిషత్తుల సారము, సర్వ వేద సారము, వేదాంత సారము. మనకు కనిపించే ఈ విశ్వము, స్థావర జంగమాత్మకమైన ప్రపంచము, సర్వ ప్రాణికోటి, ఇదంతా ఆ పరబ్రహ్మము యొక్క వ్యక్త రూపము. జగద్గురువులు శ్రీ ఆదిశంకర భగవత్పాదులు తమ భాష్యములో ఈ విషయమునే నిరూపించారు. 'తజ్జ' ని 'తస్మాతద్ బ్రహ్మణో జాతం' అని చెప్పారు.

తైత్తిరీయోపనిషత్తులో బ్రహ్మ లక్షణాలను ఇలా చెప్పారు - '*యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి, యత్ప్రయంత్యభిసంవిశన్తి, తద్విజిజ్ఞాసస్వ, తద్ బ్రహ్మేతి*' (తైత్తిరీయోపనిషత్తు - భృగువల్లి 3.1.1). బ్రహ్మాదిస్తంబ పర్యంతమగు సమస్త భూతములు ఏ శక్తి నుండి పుట్టి, దేని చేత జీవించుచు, అంతములో దేనియందు ప్రవేశించుచున్నవో, అదియే పరబ్రహ్మము. దానిని గురించి తెలుసు కొనుము. ఈ విషయమునే భగవాన్ శ్రీ వేదవ్యాస మహర్షులు తమ బ్రహ్మ సూత్రాలలో '*జన్మాద్యస్య యతః*' అన్న సూత్రంలో (1.1.2) చెప్పారు. జన్మ మొదలైనవి - అనగా సృష్టి, స్థితి, లయలు ఎక్కడి నుంచి కలుగుతున్నాయో అదే పరబ్రహ్మము. 'తజ్జలాని' అనే పదము పరబ్రహ్మము యొక్క తటస్థ లక్షణాలను తెలియజేస్తోంది. ఇదంతా - ఈ సృష్టి అంతా బ్రహ్మమేనని ఈ పదం తెలియ జేస్తోంది. బృహదారణ్యకోపనిషత్తులో 'నేతి నేతి' అంటూ దేనిని వివరించారో అదే ఈ పరబ్రహ్మము. '*ఇదం సర్వం*' అని చెప్పబడిన ఈ సృష్టి అంతా బ్రహ్మమే! కనుక దేని నుంచి ఈ

సర్వము వస్తోందో, దానిని ప్రశాంత చిత్తముతో ధ్యానించాలి. మన భౌతిక పరిశీలనకు జీవుడు దేవుడు భిన్నంగా కనిపిస్తారు. కానీ ఉపనిషత్తులు '*ఏకమేవాద్వితీయం బ్రహ్మ*' (ఛాందోగ్యోపనిషత్తు 6.2.1.& 6.2.2) రెండు లేవు, ఉన్నది ఒక్కటే అని చెప్తున్నాయి. అదెలా సాధ్యం? అందుకే జగద్గురువులు శ్రీ ఆదిశంకర భగవత్పాదులు ఈ సృష్టిని మిథ్య అన్నారు. శుక్తి రజత భ్రాంతితో, రజ్జుసర్ప భ్రాంతితో, ఎండమావులతో మృగతృష్ణతో వివరించారు.

భగవాన్ శ్రీ రమణ మహర్షి కూడా ఈ విషయాన్నే ఇలా చెప్పారు - ఆత్మ జ్ఞాని సర్వత్ర ఆత్మనే చూస్తాడు. ప్రపంచం ఉన్నదో లేదో అతనికి అనవసరం. అతను మటుకు ఎల్లప్పుడూ అంతటా ఆత్మనే దర్శిస్తాడు. కాగితం మీద ఉన్న అక్షరాలను చదువుతూ ఆ భావాలలో మునిగిపోతారు సాధారణ మానవులు. కానీ ఆ అక్షరాలకు ఆధారం కాగితం అని గుర్తించరు. జ్ఞానికి కాగితం మీద అక్షరాలు ఉన్నా, లేకపోయినా, అవి రాయాలంటే కాగితం ఆధారమని తెలుసు. అద్వైత వేదాంతులు కూడా ప్రపంచం లేదు అనలేదు, మనం చూస్తున్నది యదార్థం కాదు అన్నారు.

తేజోబిందు ఉపనిషత్తు (1.29) ఇలా చెప్తోంది - '*దృష్టిం జ్ఞానమయీం కృత్వా పశ్యేద్బ్రహ్మమయం జగత్* జ్ఞానమయమైన దృష్టితో ప్రపంచమును బ్రహ్మమయముగా దర్శించవలెను.

వేదములు, ఉపనిషత్తులు, దర్శనములు, శ్రీమద్భగవద్గీత కూడా ఈ సత్యాన్నే బోధిస్తున్నాయి. ఋగ్వేదములోని పురుష సూక్తము - '*పురుష ఏవేదగ్ం సర్వమ్...*' అని చెప్పింది. ఈ సర్వము పురుషుడే! 'పురుష' అనే పదానికి అర్థం ఇలా చెప్పారు - '*పూర్ణత్వాత్ పురుషః* అతడు పూర్ణుడు కనుక పురుషుడు, '*పురి శయనాత్ పురుషః* శరీరమనే పట్టణంలో ఉంటాడు కనుక పురుషుడు, '*పూరయతి సర్వం ఇతి పురుషః* సర్వమును పూరిస్తాడు కనుక పురుషుడు. పురుష సూక్తంలో విరాట్పురుష వర్ణన చేశారు. శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి విశ్వరూపాన్ని దర్శింపజేసిన వైనం గురించి శ్రీమద్భగవద్గీతలో విశ్వరూప సందర్శన యోగంలో తెలుసుకున్నాము.

డేవిడ్ బోహ్మ్ అనే విజ్ఞాన శాస్త్రవేత్త 'ఈ ప్రపంచమంతా అఖండమనీ, దానిలో నిరంతరమైన అంతస్సంబంధం శాశ్వతంగా ఉంటుందని, అణువుల మధ్య విద్యుదయస్కాంత తరంగాల వంటి వార్తాహరులతో పని లేద'నీ చెప్పారు. మన విరాట్స్వరూప వర్ణన చెప్పే సత్యాన్నే వీరు ఆమోదించారు. మన శరీరంలోని తల నుంచి, తలపైని వెంట్రుకల నుంచి కాలి వేళ్ళ గోళ్ళ దాకా 'ఆపాదతలమస్తకః' అన్నట్లుగా ఒకే అఖండ శరీరమైనట్లుగా ఈ ప్రపంచమంతా ఒకే పరమాత్మ యొక్క దేహము అని మన వేదాంతం నిరూపిస్తోంది. అదే 'సర్వం ఖల్విదం బ్రహ్మ' వివరణ. దీనినే నేటి విజ్ఞాన శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు. అథర్వ వేదము (10.8.27) లో ఇలా ఉన్నది. '*త్వం స్త్రీ, త్వం పుమానసి,*

*త్వం కుమార ఉత వా కుమారీ, త్వం జీర్ణోऽసి...'* నీవే స్త్రీవి, నీవే పురుషుడవు, నీవే బాలుడవు లేక బాలికవు, నీవే వృద్ధుడవు...' అంటూ సర్వమూ బ్రహ్మమేనని చెప్పింది. నారాయణ సూక్తంలో ఇలా చెప్పారు - '*విశ్వం నారాయణం దేవ మక్షరం పరమం పదమ్, విశ్వమేవేదం పురుషస్తద్విశ్వముపజీవతి...*' ఈ విశ్వమంతా నారాయణుడే! ఈ విశ్వమంతా ఆ పరమ పురుషుడే! '*భూతాని విష్ణుః, భువనాని విష్ణుః*' - సర్వము విష్ణువే, బ్రహ్మమే! ముండకోపనిషత్తులో (2.2.12) ఇలా చెప్పారు -

'*బ్రహ్మైవేదమమృతం పురస్తాద్ బ్రహ్మ పశ్చాద్ బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ* ।

*అధశ్చోర్ధ్వం చ ప్రసృతం బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్*' ॥

ఈ దృశ్యమానమైన జగత్తంతా అమృతమైన ఆ బ్రహ్మము యొక్క రూపమే! ముందు, వెనక, పైన, క్రింద, దక్షిణ దిక్కులో, ఉత్తర దిక్కులో, కుడి పక్కన, ఎడమ పక్కన అంతటా బ్రహ్మమే నిండి ఉన్నది. ఈ జగత్తంతా బ్రహ్మమునందే ఉన్నది.

ఛాందోగ్యోపనిషత్తులో ఆరుణి మహర్షి తమ కుమారుడు, శిష్యుడు అయిన శ్వేతకేతువునకు బ్రహ్మ తత్త్వాన్ని నిరూపిస్తూ తొమ్మిది సార్లు 'స య ఏషోణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో' అంటూ పృథివ్యప్తేజస్సులతో నిర్మితమైన ఈ విశ్వమంతా బ్రహ్మమే అనీ ఆ బ్రహ్మము నీవేననీ - నీలోని ఆత్మేననీ బోధించారు.

శ్రీమద్భగవద్గీతలో పరమాత్మ స్థావర జంగమాత్మకమైన సర్వము బ్రహ్మమేనంటూ ఇలా చెప్పారు -

'*బహిరంతశ్చ భూతానామ్ అచరం చరమేవ చ* ।

*సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్*' ॥

(భగవద్గీత - 13.16)

చరాచర భూతములన్నింటికి బైట లోపల పరిపూర్ణముగా నుండువాడు, చరాచర రూపుడు అతడే. అతి సూక్ష్మ రూపుడైనందున తెలుసుకొన శక్యము కానివాడు, అతి దూరముగ, అతి దగ్గరగా నుండువాడు అతడే! ఆ పరబ్రహ్మమే!

'*మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ* ।

*మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ*' ॥

(భగవద్గీత - 7.7)

తాను తప్ప ఇతరమేమీ లేదనీ, దారముతో మణులు కూర్చబడినట్లుగా, తనయందే ఈ విశ్వమంతా ఉన్నదని పరమాత్మ చెప్పాడు. ఇది 'సర్వం ఖల్విదం బ్రహ్మ'మని చెప్పటమేగా!

'*సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్* ।

*వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి*' ॥

(భగవద్గీత - 13.28)

నశ్వరములైన (నశించునది) చరాచర ప్రాణులయందు సమముగా స్థితుడైయున్న, నాశరహితుడైన పరమేశ్వరుడిని చూచువాడే నిజమైన ద్రష్ట.

చతుశ్లోకీ భాగవతంలో మొదటి శ్లోకంలో శ్రీ కృష్ణ పరమాత్మ ఇలా చెప్పారు -

'*అహమేవాసమేవాగ్రే నాన్యద్యత్ సదసత్పరమ్* ।

*పశ్చాదహం యదేతచ్చ యోఽవశిష్యేత సోఽస్మ్యహమ్*' ॥

నేనే సృష్టికి ముందర, సృష్టి ఉన్నప్పుడు, సృష్టి లయించినప్పుడు కూడా ఉన్నాను. ఇతరమైనది వేరొకటి లేదు. ఏదైతే సత్ కి, అసత్ కి పరమైనదో అది వేరే ఏదీ లేదు. 'అహమేవ అగ్రే ఆసమ్'. అన్నింటి కంటే, అందరి కంటే ముందు ఉన్నది నేనే. అంటే సద్రూపంలో ఉన్న నిర్గుణ నిరంజనమైన పరమాత్మే, అసత్తు రూపంలో అనగా సృష్టి రూపములో ఉన్నారు. 'నాసదీయ సూక్తం' లోను ఈ సత్యాన్నే చెప్పారు. అసలు ఈ సృష్టికి మూలాధారమేమిటి? అన్న ప్రశ్నకు సమాధానం ఋగ్వేదంలోని 'నాసదీయ సూక్తం' లో ఇలా చెప్పారు –

'*నాసదాసీన్నో సదాసీత్ తదానీం నాసీద్రజో నో వ్యోమాపరో యత్* ।

*కిమావరీవః కుహ కస్య శర్మన్నంభః కిమాసీద్గహనం గభీరమ్* ॥ (ఋగ్వేద సంహితా, 10-129-1). సృష్టికి ముందు అసలు సత్తు లేదు, అసత్తు లేదు, అంతా శూన్యం వ్యాపించి ఉండి ఉంటుంది. అసలు శూన్యమే లేదేమో! భూమి లేదు, ఆకాశం లేదు మరియు ఆకాశానికి అవతల కూడా ఏమీ లేదు. సృష్టిని చెయ్యడానికి ముందు ఈ జగత్తు ఒక మూతతో కప్పబడి ఉన్నదా? ఆ మూతను దేనితో తయారు చేశారు? అసలు ఆ మూత ఉన్నదా? ఇది ఎవరికి తెలుసు? ఈ విధంగా సాగుతాయి సూక్తంలోని తరువాతి మంత్ర శ్లోకాలు. నాసదీయ సూక్తము యొక్క సారమేమిటంటే, ఈ సృష్టికంతటికీ మూలం అనిర్వచనీయమైన శుద్ధ తత్త్వము. దానికి నామరూపాలు లేవు. అది కేవలం చైతన్య పదార్థమే. అది వివిధ కార్యముల నిర్వహణ శక్తి. దానికి ఆద్యంతాలు లేవు. నిరంతరంగా దీని కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయి. భూమి మీద ఈ అనంత సృష్టి ఏర్పడటానికి ముందు పగలు రాత్రి లేవు. వేడి చలి లేవు. వెలుగు కూడా లేదు. అంతా చీకటి. మానవ మేధకు అంతు పట్టని అనిర్వచనీయమైన ఒక 'శక్తి' ఉన్నది. దానినే 'బ్రహ్మము,' 'చైతన్య శక్తి' అంటారు. ఈ సృష్టికి అదే మూల బీజం. దాని నుంచే సృష్టి ఏర్పడింది.

భగవద్గీత (13.19) లో పరమాత్మ ఇలా చెప్పాడు -

'*ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః* ।

*మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే* ॥

ఇంత వరకు క్షేత్రమును, జ్ఞానమును, జ్ఞేయమును గురించి సంక్షిప్తంగా వివరించాను. ఈ తత్త్వమును సమగ్రముగా తెలుసుకున్న నా భక్తుడు నా స్వరూపాన్నే పొందుతాడు. భగవద్గీతలోనే (4.24) లో

'*బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్* ।

*బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా*' ॥

అని, సర్వము బ్రహ్మమేనని చెప్పారు. జ్ఞానికి సర్వము బ్రహ్మమే! అశాశ్వతమైన జీవుడు, ఆ జీవునికి మూలమైన పరతంత్రమైన ప్రకృతి సర్వ తంత్ర స్వతంత్రమైన, శాశ్వతమైన

పరబ్రహ్మము యొక్క అభివ్యక్తములే! పరబ్రహ్మ స్వరూపములే! దీనిని తెలియజేయటానికే శ్రీ ఆదిశంకర భగవత్పాదులు జగత్తు వ్యావహారిక సత్తా అని, జీవుల అనుభవము ప్రాతిభాసిక సత్తా అని, యథార్థతః ఉన్నది బ్రహ్మము మాత్రమేననీ, అదే పారమార్థిక సత్యమనీ వివరించారు. సర్వ వేదముల, ఉపనిషత్తుల సారము అద్వైతమే! దశోపనిషత్తులకు, భగవద్గీతకు వ్రాసిన భాష్యములలో, బ్రహ్మ సూత్రముల భాష్యములో ఆద్వైతమునే వివరించారు, స్థాపించారు జగద్గురువులు శ్రీ ఆదిశంకర భగవత్పాదులు. ఛాందోగ్యోపనిషద్భాష్యంలో '*సర్వం ఖల్విదం బ్రహ్మ, తజ్జలానీతి శాంత ఉపాశీత* మంత్ర వాక్యమును వివరిస్తూ పరబ్రహ్మము నుంచి ఈ సృష్టి అంతా బహిర్గతమయిందనీ, బ్రహ్మములోకే లయమవుతుందనీ చెప్పి అద్వైత పరంగా మహావాక్యములను వివరించారు.

సర్వం ఖల్విదం బ్రహ్మ అన్నదే అద్వైత సారము. అద్వైత సారమే సర్వం ఖల్విదం బ్రహ్మ. మన శరీరంలోని వివిధ భాగాలలో ఉన్నది ఒకే చైతన్యం. ఒక వృక్షములో - మామిడి చెట్టులో వేళ్ళు, కాండము, ఆకులు, కాయలు, పళ్ళల్లో ఒకే చైతన్యం ఉంది. అలాగే సృష్టి అంతటిలో ఒకే చైతన్యం ఉంది. సచ్చిదానంద స్వరూపమైన ఆ సత్పదార్థము సత్తు కాదు, అసత్తు కాదు. కనుక మనము ఆ సత్తును - సత్యమును 'సదసదతీత సత్' అనవచ్చును అని నాకు అనిపిస్తున్నది. 'సదసదతీత సత్ - సత్ కు, అసత్ కు అతీతమైన సత్.' ఉన్నది ఒక్క 'సత్' మాత్రమే! ఆ సత్తే పరమాత్మ. ఆ సత్తే విశ్వము. ఆ సత్తే సర్వము. దానినే 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అని ఉపనిషత్తులు వివరించాయి.

ష్రోడింగర్ అనే విజ్ఞానవేత్త ఎన్నో పరిశోధనలు చేశాక, చివరికి ఉపనిషత్తులే తనకు పరిష్కారం చూపించాయని ప్రకటించాడు.

శ్రీమద్భాగవతంలో ఇలా చెప్పారు -

కం ॥ లోకంబులు లోకేశులు

లోకస్థులుఁ దెగినఁ దుది నలోకం బగు పెం

జీకటి కవ్వల నెవ్వం

డే కాకృతి వెలుఁగు నతని నే సేవింతున్ ॥

(శ్రీ పోతనామాత్యుల ఆంధ్ర భాగవతము, అష్టమ స్కంధము, 75వ పద్యం). లోకాలను, లోకస్థులను, లోకేశులను దాటాక ఉన్న చీకటికి అవతల ఉన్న అఖండమైన వెలుగుతో ప్రకాశించే ఏ జ్యోతిస్స్వరూపుడున్నాడో అతనిని - ఆ పరబ్రహ్మమును నేను సేవిస్తాను. అదే సదసదతీత సత్తని చెప్పవచ్చును.

మహావాక్యములన్నింటి సారము అద్వైత జ్ఞానమే! అఖండమైన, ఏకమేవాద్వితీయమైన, సర్వవ్యాపక, సర్వశక్తిమత్వ, సర్వజ్ఞత్వ పరబ్రహ్మమే విశ్వ వ్యాపక చైతన్యమని గుర్తించటమే! పరమాత్మ ఈ విశ్వంలో అంతస్సూత్రంలా, అంతర్యామిగా ఉన్నాడు. ఈ అంతర్యామిని గుర్తించాలంటే, 'సర్వం ఖల్విదం బ్రహ్మము'ను, అనగా ఈ సృష్టంతా పరబ్రహ్మమేనని తెలుసుకోవాలంటే, బ్రహ్మ తత్త్వాన్ని శ్రవణం చెయ్యాలి,

మననం చెయ్యాలి, నిదిధ్యాసనం చెయ్యాలి. సాధన ద్వారా బ్రహ్మ తత్త్వాన్ని అర్థం చేసుకోవాలి, అనుభవంలోకి తెచ్చుకోవాలి. అప్పుడు '*నేహ నానాస్తి కించన*' (కఠ. ఉ. - 2.1.11) ఇక్కడ నానాత్వం లేదు,

'*మృత్యోస్సమృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి*' (కఠ. ఉ. - 2.1.10) ఇక్కడ నానాత్వాన్ని చూస్తున్న వారు జన్మ పరంపరలను పొందుతారు, అన్న ఉపనిషణ్మంత్రాల అర్థం బోధపడుతుంది. సృష్టిలో ఎక్కడా నానాత్వం గోచరించదు. అంటే బాహ్యేంద్రియాలకు నానాత్వం గోచరిస్తున్నా, ఈ నానాత్వంలో ఉన్న ఏకత్వం కేవలం బ్రహ్మమేనని తెలుస్తుంది.

'*ఈశావాస్యమిదం సర్వం*' (ఈశావాస్యోపనిషత్తు - 1) అని గ్రహిస్తారు. '*అనేక కోటి బ్రహ్మాండగ్ం సర్వం మిథ్యేతి నిశ్చిను*' (తేజోబిందూపనిషత్ - 5-54) అని చెప్తోంది ఉపనిషత్తు. ప్రపంచంలో ద్వైతం ఉంది, అనేకత్వం ఉంది. నానాత్వాన్ని మనం చూస్తున్నాము. కానీ మనం దేనిని చూసినా, ఎవరిని చూసినా ఉపాధి భేదమేనని గ్రహించాలి. ఉపాధులకు తగిన గౌరవమిచ్చి ప్రవర్తించాలి. అన్ని ఆభరణాలలో ఉన్నది బంగారమేనని మనకు తెలుసును. కానీ ఉంగరాన్ని వేలికి పెట్టుకుంటాము, గొలుసు మెడలో వేసుకుంటాము, గాజులు చేతికి తొడుక్కుంటాము. అలాగే ఈ ప్రపంచమంతా విభిన్న ఉపాధులలో కనిపించే పరబ్రహ్మమే అయినా, తల్లిని తల్లిగా, చెల్లిని చెల్లిగా, ఎవరిని వారి అనుబంధానికి తగినట్లుగానే గౌరవించాలి. ఉపాధులను ఉపాధి ధర్మాలతోనే చూడాలి. అలాగే వ్యవహరించాలి. కానీ ఉపాధులలోని అంతర్యామిని గుర్తించగలగాలి. సర్వత్ర బ్రహ్మమునకు అభిన్నతను దర్శించాలి. నామరూపాలను మనం వ్యవహారానికి పెట్టుకున్నాము. నామరూపాలు బ్రహ్మము కాదు. బ్రహ్మము నామరూపాలతో అభివ్యక్తమవుతున్నది. దేని వలన నామరూపాత్మక జగత్తు అభివ్యక్త మవుతున్నదో అది బ్రహ్మము.

మహర్షులు శ్రుతుల సారాన్ని తమ తపస్సమాధి స్థితిలో దర్శించి తాము దర్శించిన సత్యాలను, తమ అనుభవాలను షడ్దర్శనాలుగా మనకు అనుగ్రహించారు. ఎవరి దృక్పథము వారిదే అయినా, సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస దర్శన కారులు చర్చించినది జీవుడు, ఈశ్వరుడు, ప్రకృతిలను గురించే! శాశ్వతానందమును పొందటమును గురించే!

సాంఖ్యులు 24 తత్త్వాలను, పురుషుని గురించి చెప్పారు. వాటిని గురించిన జ్ఞానం పొందితే కైవల్యం ప్రాప్తిస్తుందంటారు. '*సర్వం ఖల్విదం బ్రహ్మ*' జ్ఞానముతో సాంఖ్య జ్ఞానము సిద్ధించింది కదా!

యోగ దర్శనము '*యోగశ్చిత్తవృత్తి నిరోధః*' అని చెప్పింది. యోగశాస్త్రము చెప్పినట్లుగా చిత్తవృత్తులను నిరోధించి నిర్వికల్ప సమాధి స్థితిలో కలిగిన ఋతంభర ప్రజ్ఞతో మహర్షులు అనేక నిగూఢ రహస్యాలను వెల్లడి చేశారు. యోగము అంటేనే కలయిక. యుజ్ - యునక్తి,

యుజ్యేక్తే - జతకూర్చు - అనే ధాతువు నుంచి యోగము అనే పదము ఏర్పడింది. యోగ దర్శనము ప్రకృతి గురించి, పురుషుని గురించి చెప్తూ '*అసంగోऽయం పురుషః*' అని చెప్తుంది. యోగదర్శనము బోధించిన జీవాత్మ పరమాత్మల కలయికే మహావాక్యముల సారము, అద్వైతము బోధించిన యోగము. ఈ విధంగా యోగశాస్త్ర పరంగా మహావాక్యముల భావమును గ్రహించాలి. '*అహం బ్రహ్మాऽస్మి*' అనుభవమే నిర్వికల్ప సమాధి స్థితిలో సాధకునికి కలిగే ఆత్మానుభూతి. వైశేషిక దర్శనం కూడా అణువుల గురించి, పదార్థం గురించి చెప్తుంది. పదార్థ జ్ఞానంతో యదార్థ జ్ఞానం కలిగి, '*జ్ఞానాదేవ తు కైవల్యం*' కనుక ముక్తి లభిస్తుంది. మహావాక్యముల సారము యదార్థ జ్ఞాన బోధయే!

ఉత్తర మీమాంస అయిన వేదాంత దర్శనంలో ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంత కర్తలు ఉపనిషత్తులకు, బ్రహ్మ సూత్రములకు భాష్యములను తమ తమ సిద్ధాంతములకు అనుగుణంగా వివరించారు. ద్వైత సిద్ధాంతమును ప్రతిపాదించిన శ్రీ మధ్వాచార్యులవారు '*తత్త్వమసి*' మహావాక్యమును - అతత్ త్వమసి అంటూ అక్కడ అవగ్రహం ఉన్నట్టుగా గ్రహించారు.

'*స య ఏషోఽణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యం స ఆత్మాऽతత్త్వమసి శ్వేతకేతో*' అంటూ,

'*తత్త్వమసి*' అని కాకుండా, '*అ తత్ త్వం అసి*' నీవు ఆ పరబ్రహ్మము కావు. జీవుడు బ్రహ్మము భిన్నులు - అని వివరించారు. శ్రీమద్భాగవతము, నిష్కామ కర్మ యోగమును బోధించిన శ్రీమద్భగవద్గీత కూడా '*సర్వం ఖల్విదం బ్రహ్మ*' బోధించిన అద్వైతాన్నే బోధించాయి. శ్రీమద్భాగవతంలో ప్రహ్లాదుడు సర్వత్ర హరి దర్శనం చేశాడు. విశ్వాన్ని విష్ణు స్వరూపంగా దర్శించాడు. కనుకనే అన్నింటిలోను అతనికి హరియే దర్శనమిచ్చాడు.

మ ॥ కలడంభోధి కలండు గాలి కలడాకాశంబునం గుంభినిం
గలడగ్నిన్ దిశలం బగళ్ళనిశలన్ ఖద్యోత చంద్రాత్మలం
గలడోంకారమునం ద్రిమూర్తుల త్రిలింగ వ్యక్తులందంతటన్
గలడీశుండు గలండు తండ్రీ!
వెదకంగానేల యీయాయెడన్ ॥

(శ్రీ పోతనామాత్యుల ఆంధ్ర భాగవతం, సప్తమ స్కంధం - 274 వ పద్యం).

కం ॥ ఇందు గలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి జూచిన
నందందే గలడు దానవాగ్రణి వింటే ॥

(శ్రీ పోతనామాత్యుల ఆంధ్ర భాగవతం, సప్తమ స్కంధం - 275 వ పద్యం).

ఎక్కడ చూచినా ఉన్నది పరతత్త్వమే! వెతికి తెలుసుకోవాలి. అదే '*సర్వం ఖల్విదం బ్రహ్మ*'. మనము ఉపాధులలో ఉంటున్నంత కాలము, ఉపాధులలో ఉంటున్నామని భావిస్తున్నంత కాలము ఉపాధి ధర్మాలను తప్పక పాటించాలి. కానీ బ్రహ్మ తత్త్వాన్ని గ్రహించి,

దర్శించి, అనుభవించ గలిగిన వారికి, బ్రహ్మ నిష్ఠులకు, అద్వైతులకు ప్రపంచంలో నానాత్వం గోచరిస్తున్నా, వారికి నానాత్వం గోచరించదు. బ్రహ్మమే సాక్షాత్కరిస్తుంది. కుమ్మరివానికి మట్టితో చేయబడిన సమస్త పరికరాలలో మట్టే గోచరిస్తుంది. స్వర్ణకారునికి సమస్త స్వర్ణాభరణాలలోను బంగారమే గోచరిస్తుంది, ఆభరణ రూపం గోచరించదు. అలాగే అద్వైతికి, బ్రహ్మజ్ఞానికి విశ్వంలో సర్వత్ర పరమాత్మే గోచరిస్తాడు. సర్వంలో తనను చూస్తాడు, తనలో సర్వాన్నీ చూడగలుగుతాడు. అలా అనుభవించ గలగటమే '*సర్వం ఖల్విదం బ్రహ్మ*' దర్శనం!! దత్తాత్రేయ స్వామి వద్ద ఉపదేశం పొందిన కార్తవీర్యార్జునుడు తన గురువుతో ఇలా చెప్పాడు -

*'దేశే కాలే పదార్థే వా చిదాత్మైకో విభాతి మే* ।

*చిదానందో మహాత్మేశ పదార్థోఽన్యో న విద్యతే'* ॥

దేశంలో, కాలంలో, పదార్థంలో అంతటా చిదానందమే కనిపిస్తోంది. చైతన్యం కంటే వేరే వస్తువు లేనేలేదు. ఉన్నది ఒక్క బ్రహ్మమే! ఆ బ్రహ్మమే అందరిలో జీవాత్మగా ఉన్నాడు. విశ్వంలోని ప్రతి వస్తువుగా భాసిస్తున్నాడు. ఆయనే భోజ్యము, భోక్త. విరాట్స్వరూపంలో విశ్వమంతా వ్యాపించి ఉన్నది బ్రహ్మమే ! ఈ విశ్వ శక్తితో అనుసంధానం చేసుకోగలిగిన సాధకులు, బ్రహ్మజ్ఞులు తృప్తి పొందితే విశ్వం మొత్తం తృప్తి చెందుతుంది. అటువంటి వారు తమలోని ప్రకృతిని స్థంభింప జేస్తే, బైట విశ్వంలోని ప్రకృతి స్థంభించిపోతుంది. ఈ సత్యాన్నే ధృవ చరిత్ర స్పష్టం చేస్తున్నది. ఐదేళ్ళ పసి బాలుడు ధృవుడు శ్రీమన్నారాయణుని గురించి తీవ్రమైన తపస్సు చేస్తూ, తన ఊపిరిని స్థంభింప జెయ్యగానే, అతను విశ్వాత్మతో అనుసంధానించబడ్డాడు కనుక, విశ్వంలోని సర్వ ప్రాణికోటి స్తంభించి పోయింది, వాయువు స్తంభించిపోయింది. వెంటనే ధృవునికి అప్పటి వరకు అతని హృదయంలో దర్శనమిస్తున్న శ్రీ హరి అతని కళ్ళ ముందు సాక్షాత్కరించాడు.

శ్రీ కృష్ణ పరమాత్మ, ద్రౌపదీదేవి దగ్గర ఉన్న అక్షయ పాత్రలోని ఒక్క అన్నం మెతుకును నోట్లో వేసుకుని 'విశ్వం తృప్యతామ్' అనగానే, దుర్యోధనుడు పంపగా ధర్మరాజును పరీక్షించటానికి వచ్చిన యాభై వేల మంది శిష్యులతో సహా దుర్వాస మహర్షికి కడుపులు నిండిపోయాయి. అదీ పిండాండ బ్రహ్మాండముల సమన్వయము. ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి అంటే, ఈ విశ్వమంతా బ్రహ్మమే కనుక! '*సర్వం ఖల్విదం బ్రహ్మ*' కనుక! అది తెలుసుకుని 'శాంత ఉపాసీత' అని చెప్పారు.

ఛాందోగ్యోపనిషత్తు పంచమాధ్యాయములో 'ప్రాణదేవతోపాసన', 'వైశ్వానరోపాసన' లను వివరిస్తూ 'ప్రాణదేవతోపాసన', 'వైశ్వానరోపాసన'లను చక్కగా తెలిసిన జ్ఞాని భుజిస్తే, సకల జగత్తు తృప్తిని పొందుతుందని చెప్పబడినది. సకల ప్రాణులయందు ఉండే ఆత్మ ఒక్కటి ఐనప్పుడు మాత్రమే అది సంభవమవుతుంది. ఆత్మలు వేరైనచో నది సంభవము కాదు. కనుక దీనివలన కూడా "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని గ్రహించవచ్చును.

దేవీ మాహాత్మ్యము లేక దేవీ సప్తశతిలో ఆది పరాశక్తి తనలోనుంచే తన శక్తినే వివిధ దేవతా మూర్తులుగా సృష్టించి యుద్ధం చేస్తుంటే శుంభుడు జగన్మాతతో 'ఒక్క దానివే యుద్ధం చేస్తానని ఇంతమందిని వెంట తీసుకొచ్చావే?' అంటాడు. దానికి అమ్మవారు –

*'ఏకైవాహం జగత్యత్ర ద్వితీయా కా మమాపరా।*

*పశ్యైతా దుష్ట మయ్యేవ విశంత్యో మద్విభూతయః॥*

అని పలికి, దేవతలందరినీ తనలో లీనం చేసుకుని ఏక మూర్తిగా భాసించింది. ఉన్న శక్తి ఒక్కటే. అదే అనేకంగా భాసిస్తోంది.

వైజ్ఞానిక పరంగా కూడా మహావాక్యముల వివరణను గ్రహించాము. ఇంకా వివరంగా తెలుసుకోవాలంటే - 'యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవంతి, యత్ప్రయంత్యభిసంవిశన్తి తద్ బ్రహ్మేతి ' అన్న మంత్రము తైత్తిరీయోపనిషత్తులోని మంత్రము - 'ఆత్మన ఆకాశస్సంభూతః, ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ, పృథివ్యాం ఓషధయః, ఓషధీభ్యోఽన్నమ్, అన్నాత్పురుషః... 'అన్న మంత్ర అర్థమును బోధిస్తున్నదని గ్రహించవచ్చును. ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు పరిశోధనలో దీనినే నిరూపించారు. విజ్ఞానశాస్త్రము - ఫిజిక్స్ పదార్థము గురించి, శక్తిని గురించి చెప్తుంది. మహావాక్యములు, మూలాధార మహావాక్యము ప్రకృతి గురించి, పదార్థముల గురించి మాత్రమే కాకుండా, పదార్థముల మూలతత్త్వాన్ని గురించి విశ్లేషించి, ఉన్న తత్త్వము పరబ్రహ్మమేనని నిరూపించాయి.

విజ్ఞానశాస్త్రము మొదట్లో పదార్థము వేరు, శక్తి వేరని భావించినా, అనేక పరిశోధనల తరువాత రెండు ఒక్కటేనని నిర్ధారణ కొచ్చిందనవచ్చును. ప్రతి వస్తువు అణువుల సముదాయమే. అణువులో ఎలక్ట్రాన్ లు న్యూట్రాన్లు తిరుగుతూ ఉంటాయి. ఈ అణువులన్నీ జడ పదార్థాలా? చైతన్య స్వరూపాలా? అన్న సందేహం కలుగుతుంది. అణువులు జడమైతే, ఈ ప్రపంచమంతా జడమవుతుంది. అప్పుడది దృశ్యమవుతుంది. అనగా చూడబడేది అవుతుంది. అలా కాక, అది చైతన్యమైతే, ద్రష్ట అనగా చూచేది అవుతుంది. మైకేల్ లాల్ బోల్ట్ అనే విజ్ఞానశాస్త్రవేత్త తన 'తత్త్వశాస్త్రము మరియు నూతన భౌతిక శాస్త్రము' అనే గ్రంథంలో 'ఈ ప్రపంచము ఏక కాలంలో దృశ్యము మరియు ద్రష్ట కూడా అవుతోంది' అని వ్రాశారు. అద్వైత వేదాంతము దృక్కు, దృశ్యము, ద్రష్ట అనే త్రిపుటి గురించి చెప్తుంది. త్రిపుటి ఏకమైతే కలిగే అద్వైత స్థితిని చెప్తుంది. మైక్రో ఫిజిక్స్ కూడా ఇదే సిద్ధాంతాన్ని ధృవపరుస్తోంది.

జగద్గురువులు శ్రీ ఆదిశంకర భగవత్పాదులు తమ 'దృగ్దృశ్య వివేకము'లో ఇలా చెప్పారు. -

*'రూపం దృశ్యం లోచనం దృక్ తద్దృశ్యం దృక్తు మానసమ్।*

*దృశ్యా ధీ వృత్తయస్సాక్షీ దృగేవ న తు దృశ్యతే'॥*

ఒక వస్తువు కనిపిస్తోంది. అది దృశ్యము. దానిని చూచే దృక్కు కన్ను. ఈ కన్ను ఆ వస్తువును చూస్తోంది

కనుక అది దృక్ అయింది. కానీ ఈ దృక్ అయిన కన్ను దృశ్యమవుతోంది. దీనిని మనస్సు చూస్తోంది. కనుక మనస్సు దృక్. మనస్సు దృశ్యమవుతోంది. దానిని చూసే ద్రష్ట ఆత్మ. ఆ ఆత్మ కనుపించదు. దానినే తెలుసుకోవాలి.

1932వ సంవత్సరంలో మాక్స్ ప్లాంక్ అనే విజ్ఞాన శాస్త్రవేత్త 'చైతన్యంలో నుంచే పదార్థం ఉద్భవిస్తున్నదని నేను విశ్వసిస్తున్నాను' అని చెప్పారు. అంటే పదార్థము, చైతన్యముగా భాసిస్తున్నది పరమాత్మ శక్తే! పరమాత్మే!

సృష్టి అంతా చైతన్య స్వరూపమే! స్పందనే! దీనినే మన పురాణములు 'నటరాజ నాట్యము' గా వర్ణించాయి.

మానవ జీవిత పరమ గమ్యము శాన్తమే! అన్ని గుణములు, మనోవికారములు, భావములు అన్నీ అణిగిపోయిన స్థితి శాంతము. మనస్సు అల్ల కల్లోలముగా నున్నప్పుడు, విషయ వాసనలతో కలుషిత మైనప్పుడు మనసుకు, చిత్తమునకు ప్రశాంతత కలుగదు. కొలనులో రాయి వేసినప్పుడు ఆ నీటిలో అలలు లేచి అల్లకల్లోల మవుతుంది. అలాగే మనస్సు కూడా లౌకిక వాసనలు అణిగి చిత్తము ప్రశాంత మవాలి. ప్రశాంతమైన చిత్తమున్నప్పుడే ధ్యానము, వివేకము, ఏకాగ్రత, యథార్థ జ్ఞాన గ్రాహక శక్తి కలుగుతాయి.

జగద్గురువులు శ్రీ ఆది శంకరాచార్యులు ఇలా చెప్పారు - '*ఆదౌ బ్రహ్మాహమస్మీత్యనుభవ ఉదితే, ఖల్విదం బ్రహ్మ పశ్చాత్* ।

ముందు నేను దేహము కాదు, బ్రహ్మమును అనే జ్ఞానం కలిగితే, తరువాత ఈ సర్వము బ్రహ్మమనే జ్ఞానం కలుగుతుంది.

ముండకోపనిషత్తు (3.2.3) ఇలా చెప్తోంది –

*నాఽయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన* ।
*యమేవైష వృణుతే తేన లభ్యః తస్యైషాత్మా వివృణుతే తనూన్ స్వామ్* ॥

ప్రవచనములు వినటం వల్ల కానీ, మేధస్సు చేత కానీ, శ్రవణము వలన కానీ ఆత్మ పొందబడదు. ఏ జిజ్ఞాసువు ఆత్మను పొందగోరుతాడో అతనికి ఆత్మ తన స్వరూపమును దర్శింపజేస్తుంది. అనగా అతనికి ఆత్మ జ్ఞానము కలుగుతుంది.

బ్రహ్మ జ్ఞానము పొందాలంటే, సాధన చతుష్టయ సంపన్నుడై, త్రిగుణాతీతుడయి, సద్గురువునాశ్రయించి, మహావాక్యోపదేశము పొంది, గురువు '*తత్త్వమసి*' అని తెలియజేయగా, శ్రవణ, మనన, నిదిధ్యాసనలతో '*అహం బ్రహ్మాఽస్మి*' ని అనుభవించాలి. '*సర్వం ఖల్విదం బ్రహ్మ*' అనే మూలాధార మహావాక్యమును గ్రహించినప్పుడు 'వసుధైక కుటుంబకమ్', అందరూ ఒక్క కుటుంబమేనన్న భావన స్థిరపడుతుంది. అందరిలోని ఆత్మ ఒక్కటేననీ, కేవలము ఉపాధులలోనే భేదమున్నది తప్ప, సర్వమునకు మూలమొక్కటేననీ, మనమందరమూ సమానమేనన్న జ్ఞానము కలుగుతుంది. మనమందరము, సర్వ మానవాళి,

సర్వ ప్రాణికోటి సమానమే! భేదము కేవలము ఉపాధులకే! ప్రతి ఒక్కరూ తమకు పకృతితో, తోటివారితో, పరమాత్మతో ఉన్న అనుబంధాన్ని, బంధాన్ని గుర్తించి, తాము, వారు సమానమే, అభేదమేనని గుర్తించినప్పుడు, తమలో ఉన్న ఆత్మే, తమలో ఉన్న చైతన్యమే అందరిలోను ఉన్నదని గుర్తించినప్పుడు, ఉపాధి ధర్మాలను గౌరవించాలనీ, పాటించాలనీ గుర్తించినప్పుడు అందరినీ తమతో సమానముగానే ప్రేమిస్తారు, గౌరవిస్తారు. సర్వే సర్వత్ర శాంతి, సామరస్యము నెలకొని పృథ్వియే స్వర్గముగా మారుతుంది. కలియుగం కృతయుగమవుతుంది.

'*కృణ్వంతో విశ్వమార్యమ్*' అన్న మహర్షి వాక్కులు నిజమవుతాయి. పరస్పరము ప్రేమ భావన, సుహృద్వాతావరణము, ఆనందము వెల్లి విరుస్తుంది. విశ్వశాంతి నెలకొంటుంది.

- ఓం తత్సత్ –


ఈ పత్ర సమర్పణకు సంప్రదించిన గ్రంథములు -

1. ఉపనిషత్కల్పతరువు - ప్రథమ, ద్వితీయ, తృతీయ సంపుటములు. ప్రార్థనాగాన ప్రచార సంఘము, ప్రకాశకులు, విద్వాన్ గట్టి సత్యనారాయణ గుప్త, సత్యనారాయణ పురం, విజయవాడ.
2. శ్రీ శుకరహస్యోపనిషత్తు
3. శంకర భాష్యము - ఛాందోగ్యోపనిషత్తు
4. శ్రీమద్భగవద్గీత
5. శ్రీమదాంధ్ర భాగవతము
6. ఋగ్వేద సంహితా
7. అథర్వ వేద సంహితా
8. చతుశ్లోకీ భాగవతం
9. వేదాలలో వైజ్ఞానిక విశేషాలు - శ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తి

## రచయిత్రి గురించి



**డాక్టర్ సోమంచి (తంగిరాల) విశాలాక్షి**, ఎమ్.ఏ. (తత్వశాస్త్రం), ఎమ్.ఏ. (సంస్కృతం), ఎమ్.ఫిల్., పి.హెచ్.డి., - వీరు హైదరాబాద్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృతం ప్రొఫెసర్ గా పదవీ విరమణ చేసియున్నారు. వీరు సంస్కృత భారతి నిర్వహించే వివిధ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మరియు సంస్కృతం ఎమ్.ఏ. చదివే విద్యార్థులకు పాఠములను బోధించే అనుభవయుక్త అధ్యాపకులు. వీరు సంస్కృత భారతిలో శిక్షికా మరియు కార్యకర్త. శ్రీమతి విశాలాక్షి గారు ఆధ్యాత్మికవేత్త మరియు సనాతన ధర్మముపై ఉపన్యాసాలు ఇస్తుంటారు. వీరు వన్ వరల్డ్ యూనివర్సిటీ ట్రస్ట్ అనే సంస్థలో చీఫ్ మేనేజింగ్ ట్రస్టీగా పనిచేశారు. రక్షా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు వీరికి విశిష్ట మాతృమూర్తి బిరుదునిచ్చి సత్కరించారు. వీరు వేద సంస్కృతి సమితి (VSS)లో వైస్ ప్రెసిడెంట్ మరియు సీనియర్ ఫ్యాకల్టీ, సనాతన ధర్మంలో సర్టిఫికేట్ కోర్సులో అసోసియేట్ డైరెక్టర్. వీరు వేద సంస్కృతి సమితి నిర్వహిస్తున్న సనాతన ధర్మము సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు పాఠములను బోధిస్తున్నారు.

# Veda Samskruti Samiti

13-1-62 & 13-1-47/1
Veenapani Nagar, Malkajgiri
HYDERABAD Telangana




Veda Samskruti is an inherent intellectual property of Bhaarata dEsham. It is the basic duty and right of every citizen in Bhaarata dEsham to protect this Intellectual property. Indian Constitution and Law provides provision for protection and preservation of its culture, its monuments, architecture etc.

The Chaturvedas said to have 1131 shaakhaas right up to the time of Aadi Shankaraachaarya and thereafter during last more than ten centuries, many shaakhaas are out of practice due to various reasons and presently only seven shaakaas are in the practice of Guru shiShya parampara.

There is a need to continuously preserve these available shaakhaas which may likely to disappear in future due to various external forces acting in the country vigorously with the power of money and global politics. It is time for the intellectuals of Bharata dEsham to wake-up and work collectively to protect and preserve Veda Samskruti of Bharata dEsham, by empowering the Youth of Bharat dEsham, the future care takers of this great Indian Heritage , with suitable education of our correct history and culture.

The above background lead to formation of this Veda Samskruti Samiti which is registered under Societies acts of Government of Telangana, with Regd. No. 961/2016 by Sri A.H. Prabhakara Rao, who is the Founder and President of the Samiti.


The **vEda vaaNee** e-journal, ISSN 2583-9020, is now publishing its **Volume 1, Issue 4, January 2024.**